గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పదోన్నతి సాధించిన స్కూల్ అసిస్టెంట్ సర్టిఫికెట్ల పరిశీలన నేడు

విశాఖపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతికి అర్హత సాధించిన స్కూల్ అసిస్టెంట్ల సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో జరగనున్నది. స్కూల్ అసిస్టెంట్లు ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిస్టర్, నిర్దేశించిన ధ్రువపత్రాలతో హాజరుకావాలని పాఠశాల విద్యా ఆర్జేడీ విజయ భాస్కర్, విశాఖ డీఈవో ప్రేమ్‌కుమార్ వేర్వేరు ప్రకటనల్లో సూచించారు.

ఆ ముగ్గురే...

2023 చందనోత్సవం నిర్వహణలో వైఫల్యానికి ఈవో, ఏఈవో, ప్రత్యేక అధికారే కారణం

కలెక్టర్ అనుమతి లేకుండా రెండు వేలకుపైగా టికెట్లు అదనంగా ముద్రణ

- అంతరాలయ దర్శనాలు ఆపిన తరువాత కూడా విక్రయం
- నాలుగు వీవీఐపీ టికెట్లు, ఒక కారు పాస్ కలిపి రూ.20 వేలు చొప్పున అమ్మకం
- వెలుగుచూసిన నాటి విచారణాధికారి/జేసీ నివేదిక
- చర్యలకు సిఫారసు చేసినా పట్టించుకోని ప్రభుత్వం
- ప్రభుత్వం మారినా ఆ అధికారులు అక్కడే కొనసాగింపు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సింహాచలం చందనోత్సవం నిర్వహణలో విఫలమైన అధికారులపై ప్రభుత్వం ఏనాడూ చర్యలు చేపట్టడం లేదు. ఈ ఏడాది కూడా చందనోత్సవం రోజున గోడ కూలి ఏడుగురు మరణించడంతో అందుకు కారకులైన వారిని మాత్రమే సస్పెండ్ చేసింది. అయితే, ఈసారి కూడా చందనోత్సవం నిర్వహణలో అనేక తప్పులు దొర్లాయి. టికెట్లు లేకుండానే చాలామంది దర్శనాలు చేసుకున్నారు. వేయి రూపాయల టికెట్ల లైన్‌లో రూ.300 టికెట్లు కొన్నవారిని పంపించారు. రూ.1,500 టికెట్ల క్యూలో టికెట్ల పరిశీలన సరిగా చేయలేదు.

2023లో జరిగిన చందనోత్సవంలో తోపులాట (ఫైల్ ఫొటో)





త్రినాథరావు



ఆనందకుమార్



చంద్రశేఖర్ ఆజాద్

2023లో అతి పెద్ద విచారణ

2023లో చందనోత్సవం నిర్వహణలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. ఆ ఏడాది ఏప్రిల్ 23న ఉత్సవం జరగ్గా, తన జీవితంలో అంత దారుణం ఎప్పుడూ చూడలేదని వైసీపీకి అనుకూలమైన శారదా పీఠం స్వామే అసంతృప్తి వ్యక్తంచేశారు. నాటి దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వీవీఐపీలు అందరికీ అంతరాలయ దర్శనం కల్పించాలని పట్టుబట్టారు. ఉదయం ఏడు గంటలకే ముగించాల్సిన అంతరాలయ దర్శనాలు సుదీర్ఘంగా కొనసాగడం వల్ల ఇబ్బందులు తలెత్తాయి. దాంతో నాటి కలెక్టర్ మల్లికార్జున లోపల ఉండి అంతరాలయ దర్శనాలు 10 గంటలకు ఆపించేశారు. ఈ విషయం తెలిసి కూడా ఆలయ ఏఈఓ ఆనంద్‌కుమార్ ఉదయం 10.32 గంటలకు రూ.1,500 వీవీఐపీ టికెట్లు (50) విక్రయించి వారికి 11-12 గంటల స్లాట్‌లో దర్శనాలకు పంపించారు. వీవీఐపీలు రాజగోపురం పక్క నుంచి మెట్ల మార్గంలో పైకి వెళ్లడానికి యత్నించడంతో తొక్కిసలాట జరిగింది. పోలీస్ అధికారులు కుటుంబాలతో సహా టికెట్లు లేకుండా దర్శనాలు చేసుకున్నారు. దీనిపై పెద్ద రచ్చ జరగడంతో ప్రభుత్వం నాటి జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌ను విచారణాధికారిగా నియమించి నివేదిక కోరింది. ఆయన దాదాపు 190 మందిని విచారించి నివేదిక సమర్పించారు. ఆ రోజున ఆయన కూడా కొండపై విధుల్లో ఉండడంతో ప్రత్యక్షంగా అన్నీ చూశారు.

ఆ ముగ్గురే బాధ్యులు

నాటి చందనోత్సవంలో తప్పులు జరగడానికి అప్పటి ఆలయ ఈఓ వి.త్రినాథరావు, ఏఈఓ ఎన్.ఆనంద్‌కుమార్, ఉత్సవ ప్రత్యేక అధికారి చంద్రశేఖర ఆజాద్‌లు కారణమని, వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే దేవస్థానం ఇంజనీర్లు శ్రీనివాసరాజు, డీఈ రాంబాబు భక్తులకు ఏర్పాట్లు చేయడంలో నిర్లక్ష్యం

... మిగతా 4వ పేజీలో

ఉక్కు యాజమాన్యం కక్ష సాధింపు

మరో 1,480 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించేందుకు సన్నద్ధం

- సమ్మెలో పాల్గొంటున్న వారితో జాబితా తయారీ
- నేడు అడ్మిన్ కార్యాలయం ముట్టడికి కార్మిక సంఘాల పిలుపు
- గత నెలలో 1,731 మంది తొలగింపు
- మరో వేయి మందికి గేట్ పాస్‌లు నిలిపివేత



విశాఖపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం కార్మికులను రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరిస్తోంది. ప్లాంటులో మొత్తం 13,250 మంది కాంట్రాక్టు కార్మికులు ఉండగా, వారిలో 33 శాతం మందిని తొలగించాలని యాజమాన్యం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగా ఏప్రిల్ నెలలో 1,731 మందిని తొలగించింది. కాంట్రాక్టు కాలం పూర్తయిన మరో వేయి మందికి గేట్ పాస్‌లు ఇవ్వకుండా గాలిలో ఉంచింది. మరో రెండు వేల మంది తీసేయడానికి ఏర్పాట్లు చేసుకుంది. దీనిని వ్యతిరేకిస్తూ కాంట్రాక్టు కార్మికులు ఈ నెల 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. అయితే యాజమాన్యం ఏదో ఒక కారణం చూపించి తమను తొలగించడానికి చూస్తున్నదని తెలుసుకున్న చాలామంది సమ్మెలో పాల్గొనకుండా విధులకు వెళుతున్నారు. 25 నుంచి 30 శాతం మంది మాత్రమే సమ్మె చేస్తున్నారు. దీంతో ఉత్పత్తి తగ్గింది. ప్రతిరోజు రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా 14 వేల టన్నుల హాట్ మెటల్ తయారవుతుండగా, శనివారం ఇది పది వేల టన్నులకు పడిపోయింది. కాంట్రాక్టు కార్మికుల సమ్మె ప్రభావం కనిపించకూడదని యాజమాన్యం ఇతర శాశ్వత ఉద్యోగులకు ఆఫీసర్లతో సహా 8 గంటలకు బదులు 12 గంటలు విధులు నిర్వహించాలని ఆదేశించి, షిఫ్టులు వేస్తోంది. అయితే కాంట్రాక్టు కార్మికుల పనులను అధికారులు చేయలేకపోవడంతో ఉత్పత్తి తగ్గుముఖం పడుతోంది. దీనిని భరించలేని యాజమాన్యం సోమవారం రాత్రి మరో 1,480 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తూ ఉత్తర్వులు తయారుచేసింది. అవి ఏ క్షణంలోనైనా బయటకు వచ్చే అవకాశం ఉంది. వారిలో గత ఐదు రోజులుగా సమ్మె చేస్తున్న వారితో పాటు వారికి నాయకత్వం వహిస్తున్న కార్మిక సంఘ నాయకులు కూడా ఉన్నారని తెలిసింది. దీంతో వారు మంగళవారం అడ్మిన్ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. ఇది ఉద్రిక్తంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే అవసరమైన పోలీసు బందోబస్తును యాజమాన్యం సమకూర్చుకుంది.

చర్చలు విఫలం

గత నెలలో కాంట్రాక్టు కార్మికులను తొలగించినపుడు పెద్దఎత్తున ఆందోళన

... మిగతా 4వ పేజీలో

కొనసాగుతున్న కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె

ఉక్కుటౌన్‌షిప్, మే 26 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదనే ప్రధాన డిమాండ్‌తో చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. అయితే గడిచిన ఏడు రోజులతో పోల్చితే సోమవారం విధులకు హాజరైన కార్మికుల సంఖ్య కొద్దిగా పెరిగింది. స్వయంగా అధికారులే ఫోన్ చేస్తుండడం, విధులకు హాజరుకాకుంటే గేటు పాస్‌లు రద్దు చేస్తామని కాంట్రాక్టర్లు హెచ్చరిస్తుండడంతో కొందరు కార్మికులు విధులకు హాజరయ్యారు. ఏదిఏమైనా యాజమాన్యం స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు విధులకు హాజరుకావద్దని కార్మిక నాయకులు సూచిస్తున్నారు.

కూటమిలో కోడి వ్యర్థాల దుమారం

- దుకాణాల నుంచి సేకరణకు ఆరు నెలల కిందట జోన్ల వారీగా టెండర్లు
- పేరుకే టెండర్లు... ఒక్కో జోన్ ఒక్కో నేత అనుచరుడికి కేటాయింపు
- మిగిలిన నేతల అనుచరుల నిరాశ
- అనధికారికంగా కోడి వ్యర్థాల సేకరణ
- దీంతో నేతల మధ్య పరోక్షంగా పోరు
- తన అనుచరుడి కోసం ఏకంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి గొడవపడిన ఒక నేత
- టెండర్లు రద్దు చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరిన ప్రజా ప్రతినిధి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో కోడి వ్యర్థాల సేకరణకు కూటమి నేతలు కొందరు తమ అనుచరులను ప్రోత్సహించడం హాట్ టాపిక్‌గా మారింది. ఒక జోన్ పరిధిలోని చికెన్ వ్యర్థాల సేకరణ టెండర్ ఒక నేత అనుచరుడికి దక్కితే మరో నేత తమ అనుచరుల ద్వారా అనధికారికంగా చికెన్ వ్యర్థాల సేకరణ జరిపిస్తుండడంతో వివాదాలు తలెత్తుతున్నాయి. దీంతో ఒక ప్రజా ప్రతినిధి ఏకంగా జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి చికెన్ వ్యర్థాల కాంట్రాక్టును రద్దు చేయాలని కోరినట్టు చెబుతున్నారు.

జీవీఎంసీ పరిధిలోని ఎనిమిది జోన్లలో సుమారు 2,500 చికెన్ దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి రోజూ దాదాపు మూడు టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతుంటాయి. వాటిని నగరంలోనే ఎక్కడైనా పడేస్తే పారిశుధ్యలోపం తలెత్తడంతోపాటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున జీవీఎంసీయే స్వయంగా దుకాణాల నుంచి వ్యర్థాలను సేకరించి కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలించేది. తర్వాత కాంట్రాక్టర్లకు అప్పగించింది. చికెన్ వ్యర్థాలను కొందరు చేపల చెరువుల యజమానులు మేతగా

... మిగతా 4వ పేజీలో



కోడి వ్యర్థాల లోడుతో అనకాపల్లి వైపు వెళుతూ నరవ వద్ద పట్టుబడిన వ్యాన్



గోపాలపట్నం ఆరోగ్య కేంద్రంలో మాస్క్‌లతో సిబ్బంది, అవుట్ పేషెంట్లు

నగరంలో మరో కరోనా కేసు?

- హౌస్ సర్జన్‌కు పాజిటివ్
- గోపాలపట్నం ఆరోగ్య కేంద్రంలో కలకలం

గోపాలపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని గోపాలపట్నం 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఒకరికి కరోనా వచ్చినట్టు తెలిసింది. హౌస్ సర్జన్‌గా పనిచేసేందుకు వచ్చిన యువతికి కొవిడ్ పాజిటివ్ రావడంతో హోమ్ క్వారంటైన్‌లో ఉన్నట్టు సమాచారం. దీంతో ఆసుపత్రి సిబ్బంది అంతా సోమవారం మాస్క్‌లు పెట్టుకుని కనిపించారు. రోగులు కూడా తప్పనిసరిగా మాస్కులు ధరించాలని సూచించారు. అయితే హౌస్ సర్జన్‌కు కరోనా వచ్చిన విషయాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ధ్రువీకరించలేదు. తమ దృష్టికి రాలేదన్నారు.

ఆర్ఈసీఎస్ సొమ్ములు స్వాహా

రూ.10 కోట్ల విలువైన విద్యుత్ సామగ్రి కశింకోట నుంచి సింహాచలంలోని ఈపీడీసీఎల్ స్టోర్స్‌కు తరలింపు

ఈపీడీసీఎల్ వాహనాలు, సిబ్బంది వినియోగం

- వాటికి రవాణా చార్జీల కింద రూ.19.64 లక్షల క్లెయిమ్
- ఇస్తున్నది ఎవరు...? పుచ్చుకుంటున్నది ఎవరు..?
- అనకాపల్లి, విశాఖ అధికారుల సంయుక్త దోపిడీ

ఆర్ఈసీఎస్ భవనం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (ఆర్ఈసీఎస్) నిధులను అధికారులు అందినకాడికి దిగమింగుతున్నారు. ప్రతి నెలా కొన్ని కోట్ల రూపాయలు లాభాలు వస్తుండడంతో వాటిని ఏవేవో లెక్కలు వేసి సొంత జేబుల్లో వేసుకుంటున్నారు. ఇటీవలె ఎవరి అనుమతి లేకుండా సొసైటీ ఉద్యోగులకు పీఆర్‌సీ వర్తింపజేసిన సంగతి తెలిసిందే. దీనిపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించినా ఇటు కార్పొరేట్ కార్యాలయం గానీ, అక్కడ కశింకోట బాధ్యులు గానీ, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి అయిన జిల్లా కలెక్టర్ గానీ స్పందించలేదు. ఇప్పుడు అదే సొసైటీలో మరో బాగోతం వెలుగులోకి వచ్చింది.

ఆర్ఈసీఎస్ విద్యుత్ వ్యాపారం చేయడానికి ప్రభుత్వం లైసెన్స్ ఇవ్వనందున (పునరుద్ధరణ చేయనందున) దానిని ఏపీఈపీడీసీఎల్ స్వాధీనం చేసుకొని నిర్వహించాలని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి గతంలో ఆదేశించింది. ఆ ప్రకారం ఈపీడీసీఎల్ గత మూడేళ్లుగా ఆ సొసైటీకి 'ఆర్ఈసీఎస్ కశింకోట డివిజన్' అని పేరు పెట్టి, అక్కడ ఓ

... మిగతా 4వ పేజీలో



విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి మహానాడుకు తరలివెళ్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

మహానాడుకు టీడీపీ శ్రేణులు

- నగరం నుంచి 50 వాహనాల్లో బయలుదేరిన కార్యకర్తలు

విశాఖపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): కడపలో మంగళవారం నుంచి జరగనున్న మహానాడులో పాల్గొనేందుకు నగరం నుంచి తెలుగుదేశం పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. విశాఖ పార్లమెంటు నియోజకవర్గం నుంచి 50 వాహనాలలో (బస్సులు, కార్లు, మినీ బస్సులు అన్నీ కలిపి) నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి బయలుదేరిన బస్సులకు ఎంపీ ఎం.శ్రీభరత్ జెండా ఊపారు. పార్లమెంటు నియోజకవర్గం నుంచి రెండు వేల మంది వరకూ వెళుతున్నామని అధ్యక్షుడు గండి బాబ్జీ తెలిపారు. కడపలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వసతి కల్పించారని వివరించారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జులు కడప, పరిసర పట్టణాలు, తిరుపతిలో వసతి గృహాలు బుక్ చేసుకున్నారని తెలిపారు.

అధ్వానంగా రుషికొండ బీచ్

- పేరుకుపోయిన చెత్తాచెదారం
- ఇటీవల ఒకసారి బ్లూ ఫ్లాగ్ గుర్తింపు రద్దు...
- రాష్ట్ర ప్రభుత్వ జోక్యంతో పునరుద్ధరణ
- మళ్లీ మొదటికొచ్చిన పరిస్థితి
- కరవైన అధికారుల పర్యవేక్షణ



రుషికొండ తీరంలో పేరుకుపోయిన చెత్త

విశాఖపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): రుషికొండ బీచ్‌ను బ్లూ ఫ్లాగ్ సంస్థ సూచించిన మేరకు పర్యాటక శాఖ పరిశుభ్రంగా ఉంచడం లేదు. ఈ కారణంగానే రెండు నెలల క్రితం బ్లూ ఫ్లాగ్ గుర్తింపును తాత్కాలికంగా రద్దు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించుకున్నాక పునరుద్ధరించారు. బీచ్ నిర్వహణ బాధ్యతను పర్యాటక అభివృద్ధి సంస్థతో పాటు జీవీఎంసీకి కూడా అప్పగించారు. పర్యాటకులు సంచరించే ప్రాంతంలో సముద్రం పరిశుభ్రంగా ఉంచాలనేది ప్రధాన నిబంధన. దానిని ఇక్కడ అసలు పాటించడం లేదు. నెల రోజుల కిందట పర్యాటకుల బోటు షికారు ప్రాంతంలో చెత్తాచెదారం పేరుకుపోతున్నదని 'ఆంధ్రజ్యోతి' సచిత్ర కథనం ప్రచురిస్తే అప్పటికప్పుడు శుభ్రం చేశారు. ఆ తరువాత మళ్లీ మామూలే. అమావాస్యకో, పౌర్ణమికో అన్నట్టుగా బీచ్‌ను శుభ్రం చేస్తున్నారు. రోజూ శుభ్రం చేయాలనే విషయాన్ని పర్యవేక్షకులు విస్మరిస్తున్నారు. వారాంతపు రోజులైన శని, ఆదివారాల్లో ఎక్కువ మంది పర్యాటకులు వస్తారు. ఈ ఆదివారం పెద్ద సంఖ్యలో బోటు షికారుకు వచ్చారు. ఆ ప్రాంతమంతా చెత్తతో నిండిపోయి ఉంది. నిర్వాహకులు పార్కింగ్ ఫీజుల వసూలు, బోటు షికారు టికెట్ల విక్రయంపై చూపే శ్రద్ధ బీచ్ నిర్వహణపై చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి. జీవీఎంసీ రహదారులను మాత్రమే రోజూ శుభ్రం చేస్తే బీచ్ పరిసరాలు తమ బాధ్యత కాదన్నట్టుగా వ్యవహరిస్తోంది. జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఇద్దరూ ఒక్కరే కాబట్టి దీనిపై తగిన ఆదేశాలు ఇవ్వాల్సి ఉంది.



అప్పన్నకు వైభవంగా తులసీ దళార్చన

సింహాచలం, మే 26 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా సహస్రనామ తులసీ దళార్చన సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచరాలు సమర్పించారు. అనంతరం నృసింహ సహస్ర నామావళి పఠిస్తూ అన్ని నామాలకు తులసీ దళాలతో అర్చన చేశారు. తరువాత అదే వేదికపై పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో నిత్య కల్యాణం నిర్వహించారు.

ప్రధానార్చకుడు -2గా సీతారామాచార్యులు



సింహాచలం,మే 26 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రధానార్చకుడు (2)గా కరి సీతారామాచార్యులకు పదోన్నతి కల్పిస్తూ దేవస్థానం ఈఓ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఆలయ ప్రధానార్చకుడు-2గా విధులు నిర్వర్తించిన ఇరగవరపు వెంకట రమణాచార్యులు ఈనెల 21న గుండె పోటుతో మరణించిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ఉప ప్రధానార్చకుడిగా ఉన్న సీతారామాచార్యులుకు పదోన్నతి కల్పించారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాద వేద ఆగమ పాఠశాలలో పాంచరాత్రాగమశాస్త్రంలో తర్ఫీదు పొందిన సీతారామాచార్యులు ఇటీవల తిరుమల వేంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ నుంచి ఆగమశాస్త్ర పండితుడిగా సత్కారం అందుకున్నారు. ఉప ప్రధానార్చకుడిగా ఆలయంలో జరిగే ఉత్సవాల్లో ప్రధాన పాత్ర పోషించడమే కాకుండా ఉత్సవాల్లో స్వామివారి ఉత్సవమూర్తిని అలంకరణ చేయడంలో కూడా అనుభవం ఉంది.

టైప్ షార్ట్ హ్యాండ్ పరీక్షలను వాయిదా వేయాలి

తగరపువలస, మే 26 (ఆంధ్రజ్యోతి) : టైప్ షార్ట్ హ్యాండ్ పరీక్షల నిర్వహణకు రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ జారీ చేసిన షెడ్యూల్‌ను వాయిదా వేయాలని టైప్‌షార్ట్ హ్యాండ్ సంస్థల జిల్లా అధ్యక్షుడు బల్ల వెంకటరావు కోరారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పరీక్షలు ఏటా ఆగస్టు నెలలో నిర్వహిస్తుంటారని, కానీ ఈ ఏడాది జూలై 12, 13వ తేదీల్లో నిర్వహించడానికి నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. పరీక్షలు ముందుగా నిర్వహించడం వల్ల విద్యార్థుల హాజరు తక్కువగా ఉంటుందని,ఎప్పటి మాదిరిగానే ఆగస్టులో నిర్వహించాలని కోరారు.

ఎన్టీఆర్ జయంతికి ఏర్పాట్లు

భీమునిపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 102వ జయంతి బుధవారం నిర్వహించనున్నట్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు తెలిపారు. సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం 9.15 గంటలకు మూడవ డివిజన్ ఆధ్వర్యంలో చిన్నబజారు జంక్షన్‌లో వున్న ఎన్టీఆర్ విగ్రహానికి, 9.45 గంటలకు బీచ్‌రోడ్‌లో వున్న టీడీపీ కార్యాలయంలోని ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పిస్తామన్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

6న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

» ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులకు మేయర్ ఆదేశం

విశాఖపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ సర్వసభ్య సమావేశాన్ని వచ్చే నెల ఆరో తేదీన నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ మేరకు ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదేశించినట్టు సమాచారం. కౌన్సిల్ సమావేశం జరిగి ఆరు దాదాపు ఆరు నెలలు (గత ఏడాది డిసెంబరు తొమ్మిదిన) అవుతోంది. తర్వాత ఎమ్మెల్సీ కోడ్, మేయర్, డిప్యూటీ మేయర్ లపై అవిశ్వాస తీర్మానం వంటి కారణాలతో కౌన్సిల్ సమావేశం జరగలేదు. మధ్య లో ఒకసారి జరిగినప్పటికీ అది కేవలం 2025-26 బడ్జెట్ ఆమోదానికే పరిమితమైంది. మేయర్‌గా పీలా శ్రీనివాసరావు ఎన్నికైన తర్వాత జరగనున్న మొదటి సమావేశం కావడంతో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. కౌన్సిల్ సమావేశానికి అజెండా రూపకల్పన కోసం కార్పొరేటర్ల నుంచి ప్రతిపాదనలను కోరాలని అధికారులను మేయర్ ఆదేశించారు. ఈనెల 30న కౌన్సిల్ సమావేశం నిర్వహించాలనుకున్నా మహానాడు కారణంగా టీడీపీ కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు అందుబాటులో ఉండే అవకాశం లేనందున వచ్చే నెల ఆరున నిర్వహించాలని మేయర్ నిర్ణయించినట్టు అధికారులు చెబుతున్నారు.

ఇరుకు రోడ్లు.. పార్కింగ్‌కు అవస్థలు

» విస్తరణకు నోచుకోని రహదారులు
» నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు
» పట్టించుకోని జీవీఎంసీ, పోలీస్ అధికారులు

భీమునిపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పార్కింగ్ స్థలాల సమస్య నెలకొంది. ఎక్కడా కూడా వాహనాలు నిలిపివేయడానికి సరైన స్థలం లేకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. చారిత్రక, పర్యాటక, యాత్రా స్థలంగా పేరొందిన పట్టణంలో దశాబ్దాల క్రితం నిర్మించిన రహదారులే తప్ప అభివృద్ధికి అనుగుణంగా రోడ్ల విస్తరణ చేపట్టకపోవడంతో వాహనదారులకు తంటాలు తప్పడం లేదు. బీచ్‌రోడ్‌కు వెళ్లే దారిలో ఎస్‌బీఐ, ఒకటి, రెండవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులు ఎదురెదురుగా ఉండడంతో ఇక్కడ నిత్యం ట్రాఫిక్ ఉంటుంది. దీనికితోడు ఈ రోడ్డులో పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారం బైక్‌లు పార్కింగ్ చేస్తున్నారు. పాత బస్టాండ్‌లో కూడా ఇదే సమస్య ఉంది. పాత బస్టాండ్‌ను ఆనుకుని ఇటీవల బహుళ అంతస్థులు నిర్మించిన యజమానులు వాహనాలు నిలిపేందుకు షెల్లార్లు నిర్మించకపోవడం, పట్టణ ప్రణాళికాధికారులు చూసీచూడనట్టు ఉండడంతో దుకాణాలు, బ్యాంక్‌లు, లాడ్జిలకు వచ్చిన వారు బస్టాండ్‌లో వాహనాలు నిలిపివేస్తున్నారు.దీంతో స్టాండ్‌లోకి వచ్చే సిటీ బస్సులు మలుపు తిరగక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మెయిన్ రోడ్డులో పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. దుకాణాల ముందు ఒక బైక్ నిలిపి వేసినా ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇరుగ్గా ఉన్న మెయిన్ రోడ్డును విస్తరిస్తామని ఎందరో నాయకులు దశాబ్దాలుగా హామీలిస్తున్నా..కార్యరూపం దాల్చడం లేదు. మెయిన్ రోడ్‌లో పార్కింగ్ స్థలాలు లేకపోవడం, ఫుట్‌పాత్‌లు లేకపోవడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల వద్ద కూడా వాహనాలు నిలిపేందుకు తగిన పార్కింగ్ స్థలాలు లేవు. నూకాలమ్మ ఆలయానికి వచ్చే భక్తులు కూడా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కూడా పార్కింగ్ స్థలం లేక ఇబ్బందులు కలు గుతున్నాయి.



పాతబస్టాండ్ వద్ద ద్విచక్ర వాహనాల పార్కింగ్

నిత్యం అవస్థలే

పట్టణంలో ఎక్కడ చూసినా ట్రాఫిక్ సమస్యే కనిపిస్తోంది. మెయిన్ రోడ్డు ఇరుగ్గా ఉంటుందని చాలామంది పట్టణంలోకి రాకుండా లక్ష్మీనృసింహస్వామి కొండ రహదారిలో వెళ్లిపోవడానికి సుముఖం చూపుతుంటారు. దీంతో చిన్నబజారు జంక్షన్‌లో నిత్యం ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. ముఖ్యంగా వారాంతపు సెలవు రోజుల్లో భీమిలి బీచ్‌కు అధిక సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు.

ఆ సమయంలో బీచ్ రోడ్‌లో బైక్‌లు, కార్లపై వచ్చేవారు సరైన పార్కింగ్ స్థలం లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. పైగా ఈ రోడ్డులో స్టార్ హోటల్, రెస్టారెంట్లు ఉండడంతో పర్యాటకులు, సందర్శకుల వాహనాలతో రహదారి కిక్కిరిసిపోతోంది. పార్కింగ్ స్థలాల ఏర్పాటుపై జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పందించి పార్కింగ్ స్థలాల సమస్యతో పాటు రోడ్ల విస్తరణపై కూడా ప్రత్యేక దృష్టిసారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఎండాడలో గ్రీన్ బెల్ట్ ధ్వంసం

ఎండాడ, మే 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు వరహగిరి నగర్ సమీపంలో ఉన్న గ్రీన్ బెల్ట్‌ను కొందరు స్వార్థపరులు ధ్వంసం చేశారు. జాతీయ రహదారిపై ఉన్న మహిళా పోలీస్‌స్టేషన్ నుంచి ఎండాడ కూడలి సిగ్నల్ పాయింట్ వరకు జీవీఎంసీ అధికారులు గతంలో గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేశారు. హైవేపై వచ్చే వాహనాల కాలుష్యాన్ని తగ్గించేందుకు దీన్ని ఏర్పాటు చేశారు. అయితే కొందరు స్వార్థపరులు గ్రీన్ బెల్ట్‌లో చెట్లను తొలగించి అక్కడ భవన నిర్మాణానికి సంబంధించిన సామగ్రి వేసి అమ్మకాలు సాగిస్తున్నారు.ఈప్రాంతానికి కూత వేటు దూరంలోనే వార్డు సచివాలయం ఉంది. వీఆర్‌ఓలు, టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులు నిత్యం అదే మార్గంలో రాకపోకలు చేస్తుంటారు. కానీ ఎవరూ దీన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు.



మొక్కలు, చెట్లు తొలగించి వేసిన భవన నిర్మాణ సామగ్రి

ప్రమాదాలకు నిలయంగా సంగివలస జంక్షన్

» ఐదు నెలల్లో నాలుగు ప్రమాదాలు
» ముగ్గురు మృత్యువాత
» పదుల సంఖ్యలో క్షతగాత్రులు

తగరపువలస, మే 26 (ఆంధ్రజ్యోతి) : సంగివలస జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో పలు ఆస్పత్రులు, కళాశాలలు, కార్పొరేట్ పాఠశాలలు ఉండడంతో పాదచారులు తరచూ రోడ్డు దాటుతుంటారు. ఈక్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జాతీయ రహదారికి అటు ఇటు సర్వీసు రోడ్లు ఉన్నప్పటికీ వాహనాలు హైవే దాటాలంటే ఇటు వలందపేట కాని అటు తగరపువలస కాని వెళ్లాల్సి ఉంది. ఇక్కడికి సమీపంలోనే మూడు గుళ్ల అమ్మవార్ల ఆలయం ఉంది. ఈ ఆలయానికి నిత్యం భక్తులు వస్తుంటారు.



హైవేలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతం

జాతీయ రహదారి నిర్మించడానికి ముందు తరచూ ప్రమాదాలు జరగడంతో అమ్మవారి ఆలయం నిర్మించారని చెబుతారు. కానీ ఇటీవల కూడా ఈ ప్రాంతం ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు నాలుగు ప్రమాదాలు జరగ్గా ముగ్గురు మృతి చెందారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అంబేడ్కర్ కూడలిలో ట్రాఫిక్ ఇక్కట్లు

నాలుగు ప్రధాన రహదారులకు కూడలిగా ఉన్న తగరపువలస అంబేడ్కర్ జంక్షన్‌లో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. విజయనగరం, విశాఖపట్నం నుంచి తగరపువలస మీదుగా వచ్చే వాహనాలు ఇక్కడ మలుపు తిరుగుతాయి.ఈ రహదారిపైనే వ్యాపారాలు జరుగుతుండడం, రోడ్డు మధ్యలో అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించడంతో విజయనగరం మార్గంలో వచ్చే స్కూల్ బస్సులు, ఇతర వాహనాలను విగ్రహం పక్క నుంచి మలుపు తిప్పడం కష్టతర మవుతోంది. అలాగే ఇక్కడ బస్ షెల్టర్ల లేక ప్రయాణికులు రోడ్లపై ఉంటున్నారు.

మహానాడుకు తరలివెళ్లిన నాయకులు



మహానాడుకు బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు

భీమునిపట్నం (రూరల్), మే 26 (ఆంధ్రజ్యోతి) : కడపలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న టీడీపీ మహానాడు సభలకు మండలంలోని నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. లక్ష్మీపురం కూడలి నుంచి బయలుదేరిన బస్సులను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ జెండా ఊపి సోమవారం ప్రారంభించారు. జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు ఆధ్వర్యంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు సరగడ అప్పారావు, సింగనబంద సర్పంచ్ జీవీ నారాయణ, సీనియర్ నాయకులు బి. సత్యనారాయణరాజు, గాడు తాతినాయుడు తదితరులు రెండు బస్సుల్లో తరలివెళ్లారు.

భక్తులకు దాసుడు నూనె పంపిణీ



భక్తులకు నూనె పంపిణీ చేస్తున్న దాసుడు

సింహాచలం, మే 26 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి భక్తుడు, ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయక్ దాసుడు తన శిష్యులకు సోమవారం నూనె పంపిణీ చేశారు. భక్తులు ఈ నూనెను దివ్యౌషధంగా భావిస్తారు. ప్రతిరోజూ తమ ఆరాధ్యదైవం దర్శనానికి దాసుడు వచ్చి, తిరిగి వెళ్లే సమయంలో ఆలయ ఆవరణలోని నూనె బాండాగారంలో దీపారాధన చేసి, అందులో వేసిన నూనెను తన వెంట వచ్చిన శిష్య బృందానికి పంపిణీ చేస్తుంటారు. దాన్ని వారంతా శిరస్సు నుంచి అరికాలు వరకు రాసుకుంటారు. దీనివల్ల ఎటువంటి రుగ్మతలు రావని భక్తుల నమ్మకం.

ఉక్కు యాజమాన్యం కక్ష సాధింపు

... 3వ పేజీ తరువాయి

చేశారు. యాజ మాన్యంతో చర్చలు జరిగాయి. మే నెల 20వ తేదీ వరకు కార్మికులను తొలగించబోమని స్పష్టమైన హామీ ఇచ్చింది. ఆ తరువాత తొలగింపునకు చర్యలు చేపట్టడంతో వారు సమ్మెకు దిగారు. తాజాగా సోమవారం నగరంలో కార్మిక శాఖ అధికారుల వద్ద ఇరువర్గాలకు చర్చలు జరిగాయి. ఇలా చర్చలు జరిగేటప్పుడు జనరల్ మేనేజర్ స్థాయి అధికారి హాజరవుతారు. సోమవారం మాత్రం మేనేజర్ స్థాయి కలిగిన జూనియర్ అధికారిని యాజమాన్యం పంపించింది. యాజమాన్యాన్ని ఒప్పించే స్థాయి ఆ అధికారికి లేదని గుర్తించిన కార్మిక శాఖాధికారి..ఆయన్ను వెనక్కి పంపించేశారు. దాంతో చర్చలు విఫలమయ్యాయి.

సచివాలయ ఉద్యోగులకు యోగాంధ్రపై శిక్షణ



ఆసనాలు వేస్తున్న సచివాలయ ఉద్యోగులు

పద్మనాభం, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సమావేశ మందిరంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సచివాలయ ఉద్యోగులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ విజయకుమార్ మాట్లాడుతూ జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని సిబ్బంది విజయవంతం చేయాలన్నారు. ప్రధాని మోదీ విశాఖలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటున్న నేపథ్యంలో ఈనెల 21 నుంచి జూన్ 20వ తేదీ వరకు ప్రతి సచివాలయం పరిధిలో యోగా శిక్షకులతో ఏడుగురికి శిక్షణ ఇప్పించి వారితో 600 మందికి శిక్షణ ఇప్పించాలన్నారు. యోగా దినోత్సవంలో అందరూ ఉత్సాహంగా పాల్గొనేలా చేయాలన్నారు. అనంతరం ఉద్యోగులతో వివిధ యోగాలసనాలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఆయూష్ వైద్యాధికారి డాక్టర్ సౌజన్య, డిప్యూటీ ఎంపీడీఓ మీనాకుమారి, ఏఓ జయ ఉమ, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

సింహాచలం, మే 26 (ఆంధ్రజ్యోతి) : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రం డీసీఎస్ డా. ప్రసాద్ నాయక్ అన్నారు. వచ్చే నెల 21న జరిగే యోగా దినోత్సవం పురస్కరించుకుని ఆస్పత్రి సిబ్బంది సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ యోగాను జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. కాగా ర్యాలీ ఆసుపత్రి నుంచి మార్కెట్ మీదుగా సింహాచల ప్రధాన కూడలి వరకు సాగింది. ఈ కార్యక్రమంలో వైద్యులు సుదర్శన్, రామారెడ్డి, అరుణ ప్రకాశ్, రాజశేఖర్, పార్వతి, మాధవి పాల్గొన్నారు.

2న తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ధర్నా

మధురవాడ, మే 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పేదలకు రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల 2న సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాల యం ఎదుట ధర్నా చేపట్టనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు తెలిపారు. సోమవారం ఆయన ఏడో వార్డు పరిధిలోని మల్లయ్య పాలెంలో ధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు.



ధర్నా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఆ ముగ్గురే...

... 3వ పేజీ తరువాయి

వహించారని వారిపై కూడా చర్యలు తీసుకోవాలని సిఫారసు చేశారు. నాటి ప్రభుత్వం వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పైగా అదే అధికారులు ఇప్పుడూ కొనసాగుతున్నారు. ఈ ఏడాది చందనోత్సవానికి ముందు సెలవుపై వెళ్లిన ఈఓ త్రినాథరావు సోమవారం వచ్చి విధుల్లో చేరారు. ఏఈఓ ఆనందకుమార్ అదే స్థానంలో విధులు వెలగబెడుతున్నారు. ఈఈ శ్రీనివాసరాజు గోడ కూలిన ఘటనలో సస్పెండయ్యారు. డీఈ రాంబాబుపై కూడా చర్యలు లేవు.

టికెట్ల విక్రయమే పెద్ద కుంభకోణం

ప్రతి ఏటా చందనోత్సవం టికెట్ల విక్రయంలో పెద్ద కుంభకోణం జరుగుతోంది. ఈఓ కార్యాలయం వారికి నచ్చినన్ని టికెట్లు ముద్రించి అమ్ముకుంటోంది. 2023లో ఆలయ అధికారులు నాలుగు వీవీఐపీ టికెట్లు, ఒక కారు పాస్ కలిపి రూ.20 వేలు చొప్పున అమ్ముకున్నారు. నాటి టికెట్ల విక్రయంపై జేసీ విశ్వనాథన్ సుదీర్ఘ నివేదిక అందించారు. ఆ ఏడాది చందనోత్సవం టికెట్ల విక్రయం (48,015) ద్వారా రూ.3.78 కోట్ల ఆదాయం సమకూరింది.

• సమన్వయ సమావేశంలో కలెక్టర్ రూ.1,500 విలువ కలిగిన టికెట్లు 5 వేలు మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. ఆ తరువాత మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశంతో మరో వేయి టికెట్లు అదనంగా ప్రింట్ చేయాల్సిందిగా చెప్పారు. కానీ ఆలయ అధికారులు ఉత్సవం రోజున రాజగోపురం వద్ద తొక్కిసలాట జరుగుతున్నా ఉదయం 11 గంటలకు వీవీఐపీ టికెట్లు అమ్ముతూనే ఉన్నారు. ఆరు వేలకు బదులు 8,707 టికెట్లు విక్రయించారు. అదనంగా విక్రయించిన 2,707 టికెట్లకు కలెక్టర్ అనుమతి లేదు. దీనిపైనే ఈఓ, ఏఈఓలపై చర్యలు తీసుకోవాలని జేసీ సిఫారసు చేశారు. అంతకు ముందు ఏడాది 2022లో 31,486 టికెట్లు మాత్రమే విక్రయించగా 2023లో అదనంగా 17 వేలు అమ్మారు.

• వాహనాల పాస్‌లు ఇష్టం వచ్చినట్టు ఉపయోగించుకున్నారు. మొత్తం 697 పాస్‌లు జారీ చేయగా వాటిలో పోలీస్ శాఖ 258 పాస్‌లు తీసుకుందని తేలింది. దీనికి వారి నుంచి సరైన సమాధానం అందలేదు. సిబ్బందికి పాస్‌లు పేరుతో వాటిని వీవీఐపీలకు అమ్ముకున్నట్టు తేలింది.

• ఉత్సవం ప్రత్యేక అధికారిగా నియమితులైన చంద్రశేఖర ఆజాద్ జేసీ విచారణకు హాజరు కాలేదు. తనకు ఉత్సవంలో ఎటువంటి బాధ్యతలు అప్పగించలేదని, అందువల్ల తనకు సంబంధం లేదని సమాధానమిచ్చారు. దీనిని బాధ్యతారాహిత్యంగా పేర్కొంటూ చర్యలకు సిఫారసు చేశారు.

ఇప్పుడైనా స్పందించాలి

చందనోత్సవం నిర్వహణలో పదేపదే తప్పులు చేస్తూ సొంత లాభం చూసుకుంటున్న వారిపై ఇప్పటికైనా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. దేవస్థానంలో పాతుకుపోయి, ఏకంగా ఉత్సవానికే చెడ్డపేరు తెస్తున్న వారిని ఇప్పుడు జరుగుతున్న బదిలీల్లో అయినా ఇక్కడి నుంచి పంపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనా, జిల్లా నాయకులపైనా ఉంది.

కూటమిలో కోడి వ్యర్థాల దుమారం

... 3వ పేజీ తరువాయి

వేస్తుండడంతో వాటికి డిమాండ్ పెరిగింది. దీంతో చికెన్ వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించాల్సిన కాంట్రాక్టర్లు వ్యర్థాలను చేపల చెరువుల యజమానులకు విక్రయించడం మొదలుపెట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు తమకు లంచాలు ముట్టజెప్పిన వారికే చికెన్ వ్యర్థాల సేకరణ టెండర్లు దక్కేలా చక్రంతిప్పారు. దీనిపై గత ఏడాది తీవ్రస్థాయిలో దుమారం రేగడంతో అప్పటి కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా జోన్‌లవారీగా టెండర్లు పిలిచారు. సేకరించిన వ్యర్థాలను నేరుగా కాపులుప్పాడ డంపింగ్‌యార్డుకు తరలించాల్సిందేనని నిబంధన పెట్టారు. అయితే కూటమి ప్రజా ప్రతినిధులు తమ అనుచరులకు ఏదో ఒక జోన్ ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో టెండర్ నియమ నిబంధనలను పక్కనపెట్టేసి ఒక్కో ప్రజా ప్రతినిధికి ఒక్కొక్క జోన్ కేటాయించినట్టు సమాచారం. అయితే ఆ నియోజకవర్గంలో మిగిలిన కూటమి నేతలు తమ అనుచరులకు అవకాశం దక్కకపోవడంతో కోపంతో రగిలిపోతున్నారు. చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాలు అనధికారికంగా సేకరించుకోవాల్సిందిగా తమ అనుచరులను ప్రోత్సహించడం మొదలుపెట్టారు. అనధికారికంగా వ్యర్థాలను సేకరిస్తున్నారంటూ టెండరు దక్కించుకున్నవారు తమ అస్మదీయులైన నేతల వద్దకు వెళ్లి ఫిర్యాదు చేస్తున్నారు. దీనికి స్పందించిన నేతలు అలా వ్యర్థాలను సేకరించే వాహనాలను పట్టుకుని కేసులు నమోదుచేయాలని అధికారులను ఆదేశిస్తున్నారు. నేతల ఆదేశాల మేరకు అధికారులు వెళ్లి వాహనాలను పట్టుకుంటే మరో నేత వెంటనే రంగంలోకి దిగి పట్టుకున్న వాహనాలను వదిలిపెట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో అధికారులు నలిగిపోతున్నారు.

కూటమి నేతల మధ్య తారస్థాయికి చేరిన చిచ్చు

దక్షిణ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఒక జోన్‌లో చికెన్ వ్యర్థాల సేకరణ టెండర్ కోసం ఇద్దరు నేతల అనుచరులు పోటీపడ్డారు. అనూహ్యంగా వారిద్దరికీ కాకుండా మరో నియోజకవర్గానికి చెందిన ప్రజా ప్రతినిధి సిఫారసు చేసిన వారికి టెండర్‌ను అధికారులు కేటాయించారు. దీంతో ఒక నేత నియోజకవర్గ పరిధిలోని కొన్ని దుకాణాల నుంచి వ్యర్థాలు సేకరించుకోవాలని తన అనుచరుడికి పురమాయించారు. అతను మూడు వాహనాలు పెట్టుకుని చికెన్ వ్యర్థాలను సేకరించి అనకాపల్లి జిల్లాలోని చేపల చెరువులకు తరలిస్తుండగా, టెండరు దక్కించుకున్న వ్యక్తి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. విషయం సదరు నేతకు తెలియడంతో ఆగమేఘాల మీద వాహనాలు ఉంచిన పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులపై కేకలు వేశారు. చికెన్ వ్యర్థాలను కాపులుప్పాడ తరలించకుండా చేపల చెరువులకు తరలిస్తున్న కాంట్రాక్టర్‌పై ఎందుకు చర్యలు తీసుకోరని ఎస్‌ఐపై అరవడంతో ఆ వాహనాలను విడిచిపెట్టేశారు. అదే నియోజకవర్గానికి చెందిన మరొక నేత కూడా తన అనుచరుడికి టెండరు రాకపోవడంతో అనధికారికంగా సేకరించుకోవాలని అభయం ఇచ్చారు. దీంతో అతడు వ్యర్థాలను సేకరించి అనకాపల్లి వైపు వెళుతుండగా నరవ వద్ద మూడు వాహనాలను జీవీఎంసీ అధికారులు పట్టుకున్నారు. వెంటనే సదరు నేత రంగంలోకి దిగి ఆ వాహనాలను విడిచిపెట్టకపోతే తీవ్రపరిణామాలు తప్పవంటూ హెచ్చరించారు. జోన్-2 పరిధిలోకి వచ్చే ఒక నియోజకవర్గ నేత వద్ద పీఏగా పనిచేసిన వ్యక్తే బినామీ పేరుతో చికెన్ వ్యర్థాల సేకరణ కాంట్రాక్టు దక్కించుకున్నారనే ప్రచారం జరుగుతోంది. నగరమంతా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. కూటమిలోని ఒక పార్టీ నేత ఒకరికి మద్దతుగా ఉంటే...మరో పార్టీ నేత మరొకరికి మద్దతుగా నిలుస్తున్నారు. నేతల మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరు ప్రభావం ప్రభుత్వంపై పడుతుందంటూ ఒక ప్రజా ప్రతినిధి నేరుగా జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి చికెన్ వ్యర్థాల టెండర్లను రద్దు చేయాలని కోరినట్టు సమాచారం.

ఆర్ఈసీఎస్ సొమ్ములు స్వాహా

... 3వ పేజీ తరువాయి

డీఈని నియమించి వ్యవహారాలు నడుపుతోంది. అయితే సొసైటీకి చెందిన అప్పులు, ఆస్తుల లెక్క తేలలేదు. సొసైటీ బాధ్యులు పూర్తి వివరాలు అందించకపోవడం వల్ల అవన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. ఆ డివిజన్‌కు యథాప్రకారం విద్యుత్ సరఫరా చేసి, బిల్లులు వసూలు చేసి, సొసైటీ ఉద్యోగులకు ఈపీడీసీఎల్ జీతాలు చెల్లిస్తోంది. నిర్వహణ వ్యయం అంతా భరిస్తోంది. ఇవన్నీ వేరే బ్యాంకు ఖాతాల ద్వారా జరుగుతున్నాయి.

ఎవరి అనుమతితో తరలించారు?

ఇదిలావుండగా సొసైటీని స్వాధీనం చేసుకున్నప్పుడు అప్పటికే వారు విద్యుత్ పనుల నిర్వహణ కోసం సమకూర్చుకున్న పది కోట్ల రూపాయల విలువ చేసే మెటీరియల్ కశింకోటలోని ఆర్ఈసీఎస్ స్టోర్స్‌లో ఉంది. దానిని అక్కడి నుంచి సింహాచలంలో ఈపీడీసీఎల్ స్టోర్స్‌కు తరలించాలని విశాఖపట్నంలోని కార్పొరేట్ కార్యాలయంలోని సీజీఎం ఒకరు ఆదేశించారు. దాంతో కశింకోట ఆర్ఈసీఎస్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) దగ్గరుండి పంపించేశారు. ఈపీడీసీఎల్‌కు చెందిన వాహనాలతో సిబ్బంది సుమారు రెండు వారాలు తరలింపు ప్రక్రియ చేపట్టారు. ఇది గత ఏడాది ఆగస్టులో పూర్తయింది. ఇలాంటి వ్యవహారాలు నిర్వహించినప్పుడు ఏయే రకాల మెటీరియల్ ఎంత పంపించారు?, ఎక్కడికి పంపించారు?, వాటి విలువ ఎంత?...అనే వివరాలు రికార్డుల్లో నమోదు చేయాల్సి ఉంటుంది. పైగా అప్పులు, ఆస్తుల లెక్క తేలనందున వాటిని ప్రత్యేక అనుమతులు ఉంటే తప్ప వినియోగించుకోవడానికి వీల్లేదు. ఈ నిబంధనను కూడా అధికారులు ఉల్లంఘించారు.

లోడింగ్, రవాణా చార్జీల క్లెయిమ్

మెటీరియల్‌ను సింహాచలం డిపోకు తరలించడానికి కార్పొరేట్ కార్యాలయం ఈపీడీసీఎల్ సిబ్బందిని, వాహనాలను పంపించింది. అంటే వారి పనులు వారే చేసుకున్నారు. దీనికి కశింకోట ఆర్ఈసీఎస్ డివిజన్ ఈఈ రవాణా చార్జీలు ఇవ్వాలంటూ రూ.19.64 లక్షలకు బిల్లు పెట్టారు. ఇండోర్, అవుట్ డోర్ మెటీరియల్‌ను వాహనాల్లో లోడింగ్ చేయడానికి, తరలింపునకు ఉపయోగించిన వాహనాలకు అద్దెలు చెల్లించడానికి ఈ వ్యయం అయిందని బిల్లు పెట్టుకున్నారు. ఈ బిల్లు మొత్తం ఎవరెవరు పంచుకున్నారంటే...కార్పొరేట్ కార్యాలయం, కశింకోట డివిజన్ అధికారుల పేర్లు వినిపిస్తున్నాయి.

ఆర్‌టీఐలో అడిగితే డొంక తిరుగుడు సమాధానం

కశింకోట ఆర్ఈసీఎస్ అవకతవకలపై అనేక ప్రచారాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ మెటీరియల్ తరలింపుపై వివరాలు కోరుతూ సమాచార హక్కు చట్టం కింద ఒకరు దరఖాస్తు చేశారు. మెటీరియల్ తరలింపునకు అనుమతి ఇచ్చింది ఎవరు?, ఎంత ఖరీదు, ఏయే మెటీరియల్ అనే వివరాలు కోరారు. కశింకోట అధికారులు దానికి సమాధానం ఇవ్వకుండా ఆ లేఖను సింహాచలం డిపోనకు బదిలీ చేశారు. బాధ్యతాయుతమైన స్థానంలో ఉండి కోట్లాది రూపాయల విలువైన సామగ్రిని అప్పగించడమే కాకుండా ఆ వివరాలు లేవని చెప్పడాన్ని దరఖాస్తుదారు తీవ్రంగా తప్పుబట్టి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, మే 26 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ధనుంజయనాయుడు తెలిపిన వివరాల మేరకు.. ఆదర్శనగర్ ఉషోదయ కూడలిలో ఉంటున్న తన కుమార్తె (17) సమీపంలోని వివాహ కార్యక్రమానికి వెళ్లి, తిరిగి ఇంటికి రాలేదని బాలిక తండ్రి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈనెల 22న తన కుమారుడు ఆదర్శనగర్‌లోని వివాహ వేడుక వద్ద బైక్‌పై బాలికను దింపి, వెళ్లిపోయాడు. తర్వాత తిరిగి ఇంటికి రాకపోవడంతో పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. సీఐ మురళీ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేతిలో ఫోన్ లాక్కుని పరారీ

ఎంవీపీ కాలనీ, మే 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై బస్టాపు వద్ద ఎదురుచూస్తున్న ఓ ప్రయాణికుడి చేతిలో సెల్‌ఫోన్ లాక్కుని పరారైన సంఘటనపై ఎంవీపీ నేర విభాగం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ కిషోర్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. ఆరిలోవ టీఐసీ పాయింట్ ప్రాంతానికి చెందిన గని విజయవర్మ సోమవారం తెల్లవారుజాము 2.45 గంటల సమయంలో మద్దిలపాలెం బస్టాపు వద్ద ఆటో కోసం ఎదురు చూస్తుండగా, నీలి రంగు స్కూటీపై వచ్చిన ఓ వ్యక్తి వర్మ చేతిలోని సెల్‌ఫోన్‌ను లాక్కుని పరారయ్యాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'వైసీపీ బలోపేతానికి కృషి చేయాలి'

వెంకోజీపాలెం, మే 26 (ఆంధ్రజ్యోతి): నిరాశ, నిస్పృహతో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న కార్యకర్తల్లో ఉత్సాహం నింపి వైసీపీ బలోపేతానికి కృషిచేయాలని నాయకులు, ముఖ్యకార్యకర్తలకు తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావు పిలుపునిచ్చారు. ఎంఎంటీసీ కాలనీలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలో పార్టీ విజయం సాధించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యాలయం ఇంచార్జి రవిరెడ్డి, పేర్ల విజయచందర్, దుర్గారావు, అల్లంపల్లి రాజబాబు, ఉమ్మిడి దాసు, ముువ్వల లక్ష్మి, పీతల గోవింద్, బోణి శివరామకృష్ణ, చొల్లంగి నాగేశ్వరరావు, బొండా ఉమామహేశ్వరరావు, పోలిరెడ్డి, త్రినాథ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన

సింహాచలం, మే 26 (ఆంధ్రజ్యోతి) : అడివివరం శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం ఇంద్రజాల ప్రదర్శన నిర్వహించారు. షిప్‌యార్డు విశ్రాంత అధికారి, ఇంద్ర జాలికుడు శరగడం రామకృష్ణకవి పలు ఇంద్రజాల ప్రదర్శనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రజాలం మాయా మంత్రం కాదని, మూఢనమ్మకం కానేకాదని,అది కూడా శాస్త్ర విజ్ఞానమే అని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం, రిటైర్డ్ హెచ్‌ఎం కెఎస్‌ఆర్ మూర్తి, బంగారు చిట్టి, సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం),సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం)
- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **నిశ్శబ్దప్రేమ** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం),
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: రమాదేవి, సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 15, వంకాయలు (తెలుపు)20,వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 18, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 32, బీరకాయలు 36, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజీ 16, క్యారెట్ 40 దొండకాయలు 18, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది)54, బరబాటి 24, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 40, దోస కాయలు 14, వెల్లుల్లి(పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 98, కీరదోస 30, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు
బ్రాయిలర్

రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు

- పాత వెంకోజీపాలెం, కొత్త వెంకోజీపాలెం రోడ్డులో దుస్థితి
- పట్టించుకోని పోలీసులు

వెంకోజీపాలెం, మే 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సత్యం జంక్షన్, మద్దిలపాలెం, ఇసుకతోట జంక్షన్‌లలో సిగ్నల్స్ వద్ద ట్రాఫిక్‌ను తప్పించుకునేందుకు సులువైన మార్గం సత్యం జంక్షన్ నుంచి సీతమ్మధార, హెచ్‌బీ కాలనీ, పాత వెంకోజీపాలెం మీదుగా కొత్త వెంకోజీపాలెం వద్ద పాత జాతీయ రహదారికి వాహనచోదకులు ప్రయాణిస్తుంటారు. ఈ క్రమంలో నిత్యం ఈ మార్గం రద్దీగా ఉంటుంది. అయితే ఈ మార్గం పాతవెంకోజీపాలెం యల్లమాంబ నగర్ వద్ద వచ్చే ఓ ప్రైవేటు స్థలం కారణంగా రోడ్డు కుచించుకుపోయింది. దీంతో ఇక్కడకు వచ్చేసరికి రద్దీ సమయాల్లో వాహనచోదకులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఇదే ప్రాంతంలో చెత్త డబ్బాను ఏర్పాటు చేయడంతో అది తీసేటప్పుడు ఎక్కువ సమయం వాహనచోదకులు వేచి ఉండాల్సిందే. వర్షం పడితే ఈ ప్రాంతంలో కాలువ లేక మురుగు నీరంతా రోడ్డుపైనే ప్రవహిస్తుంది. ఈ విషయంపై స్థానిక సీతారామ సేవా సంఘం ప్రతినిధులు పలువురు జీవీఎంసీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితం శూన్యం. ఇప్పటికైనా అధికారులు, పాలకులు ఈ విషయమై చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.


చిన్న రోడ్డు కావడంతో నిలిచిపోయిన వాహనాలు

రహదారిపై వాహనాల పార్కింగ్

వెంకోజీపాలెం, మే 26 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెం నుంచి అటు సీతమ్మధార వరకు ఉన్న ప్రధాన రహదారిపై ఇష్టానుసారం వాహనాల పార్కింగ్ వల్ల పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇటీవల ఈ రోడ్డును వెడల్పు చేయడంతో పాటు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేశారు. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపుల ఫుట్‌పాత్‌లు నిర్మించారు. వాహనాల రాకపోకల వల్ల పాదచారులకు ఇబ్బందులు లేకుండా ఈ నిర్మాణాలు చేపట్టారు. అయితే ఒకవైపు భారీ వాహనాలను పార్కింగ్ చేస్తుండడం, మరోవైపు రోడ్డుపై కారు మెకానిక్ షెడ్లు, టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేయడంతో ఈ మార్గంలో వెళ్లే పాదచారులు భయాందోళన మధ్య రాకపోకలు సాగించాల్సి వస్తోంది. రోడ్డుపై నడిచేటప్పుడు ఎప్పుడు ఏ వాహనం వచ్చి ఢీకొని ప్రమాదానికి గురవుతామోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు, పాలకులు స్పందించి రోడ్డుపై దుకాణాలు లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


రహదారిపై ఇష్టానుసారం నిలిపివేసిన కార్లు

అధ్వానంగా చేపల మార్కెట్


నిర్వహణకు నోచుకోని మరుగుదొడ్లు

పెదవాల్తేరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 19వ వార్డు పెదజాలారిపేటలో ఉన్న చేపల మార్కెట్‌లో పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. దీంతో కొనుగోలుదారులు, అమ్మకందారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మార్కెట్‌లో నిర్మించిన మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో విపరీతమైన దుర్వాసన వస్తోంది. మార్కెట్‌కు వచ్చేవారు, చుట్టు పక్కల నివాసితులు నరకయాతన అనుభవిస్తున్నారు. అలాగే మార్కెట్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ విషయమై స్థానికులు పలుమార్లు జీవీఎంసీ పారిశుధ్యం విభాగం అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.

పౌరాణిక పాత్రలకు ఎన్టీఆర్ పెట్టింది పేరు

- కళారంగ ప్రముఖులు

డాబాగార్డెన్స్, మే 26 (ఆంధ్రజ్యోతి) : పౌరాణిక పాత్రలకు స్వర్గీయ నందమూరి తారక రామారావు పెట్టిందని పేరని కళారంగ ప్రముఖులు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పౌర గ్రంథాలయంలో స్వరార్చన భూపతి, స్వరాంజలి కృష్ణంరాజు ఆధ్వర్యంలో సినీసంగీత విభావరి జరిగింది. ఈ కార్యక్రమానికి డి. భూపతిరావు, బొడ్డేటి జగత్‌రావు, ఫణిస్వామి, మస్తాన్‌రెడ్డి, నాంచారయ్య,ఎంవీఆర్ నాగేశ్వరరావు,ఎంవీ రాజశేఖర్, భయ్యా శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.


ఫేక్ హాల్ టికెట్లతో కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థినులు, వారి కుటుంబీకులు

విద్యార్థులకు నకిలీ హాల్ టికెట్లు

- పీఎంపాలెంలోని ఓ ప్రైవేటు కళాశాల నిర్వాకం
- ఎంసెట్ పరీక్షకు దూరమైన ఇద్దరు బాలికలు

కొమ్మాది, మే 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల భవిష్యత్‌తో ఓ ప్రైవేటు కళాశాల యాజమాన్యం ఆటలాడుకుంది. ఎంసెట్ పరీక్షకు నకిలీ హాల్ టికెట్లు జారీ చేయడంతో ఇద్దరు విద్యార్థినులు పరీక్షకు దూరమయ్యారు.పీఎంపాలెం పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం.. పీఎంపాలెంలో కేఎంఆర్ పేరుతో ఇంటర్ కళాశాల నడుపుతున్నారు. విద్యార్థులకు ఇంటర్ విద్యతో పాటు ఎంసెట్ కోచింగ్ కూడా ఇచ్చారు. ప్రస్తుతం ఎంసెట్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వాల్సి ఉంది. విజయనగరం జిల్లా గుంప గ్రామానికి చెందిన గొల్లపూడి కావ్యశ్రీ, అనకాపల్లి జిల్లా నర్సీపట్నంకు చెందిన లాలం భాగ్యశ్రీ భవాని కళాశాల వసతి గృహంలో ఉంటూ ఇంటర్‌తో పాటు ఎంసెట్ కోచింగ్ పొందారు. సోమవారం వారు ఎంసెట్‌కు హాజరుకావాల్సి ఉంది.రెండు రోజుల క్రితం హాల్ టికెట్ కావాలని కళాశాల సిబ్బందిని కోరగా ఆన్‌లైన్‌లో పంపిస్తామని చెప్పారు.అలాగే ఆన్‌లైన్‌లో పంపించారు.విద్యార్థినులు సోమవారం జరిగే పరీక్షకు సిద్ధపడగా ఆదివారం వారికి ఆ హాల్ టికెట్లతో పరీక్షకు హాజరుకావద్దని కళాశాల నుంచి సమాచారం అందింది. అవి ఒరిజినల్ కాదని, ఫేక్ అని తెలియడంతో విద్యార్థినులు ఖంగుతిన్నారు. ఆదివారం కళాశాలకు వెళ్లగా అటెండర్ తప్ప ఎవరూ లేకపోవడంతో వెనుతిరిగారు. సోమవారం ఉదయం వెళ్లగా మళ్లీ అదే పరిస్థితి. దీంతో ఫోన్‌లో మేనేజిమెంట్‌ను సంప్రతించగా వారు కూడా స్పందించకపోవడంతో కళాశాల ఎదుట ధర్నాకు దిగారు.ఈవిషయమై పోలీసులు మాట్లాడుతూ ఇరువర్గాలతో చర్చిస్తున్నామన్నారు


సామూహిక సత్యసాయి వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

తునివలసలో సత్యసాయి వ్రతాలు

పద్మనాభం, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తునివలస గ్రామంలో భగవాన్ సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాలు పురస్కరించుకొని సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత సామూహిక సత్యసాయి వ్రతాలు చేపట్టారు. అనంతరం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిం చారు. 60 మంది రోగులకు డాక్టర్ సత్యవతి పరీక్షలు చేసి, 20 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. వారికి శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నారు.

సాయంత్రం సత్యసాయి పాదులకను పల్లకీలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల సేవాదళ్ రాష్ట్ర కోఆర్డినేటరు డి. రాఘవరావు, స్టడీ సర్కిల్ జిల్లా ఇన్‌ఛార్జి పి. ప్రసాద్, శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు పైడిరాజు, విశాఖ జోనల్ కో ఆర్డినేటర్ సాయికుమార్, రెడ్డిపల్లి భజనమండలి కోఆర్డినేటర్ వై. గురునాథరావు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

సాగర్‌నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం పేరుతో ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ఆంధ్రప్రదేశ్ ఎన్‌సీసీ 13వ బెటాలియన్ ఎల్‌టీ కల్నల్ కమాండింగ్ ఆఫీసర్ నీరజ్‌కుమార్ పిలుపునిచ్చారు. రుషికొండ గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ క్యాడెట్ల వార్షిక శిక్షణ శిబిరంలో సోమవారం ఆయన మాట్లాడారు. జీవరాశికి ప్రాణవాయువు ఇచ్చే చెట్లను కాపాడుకోవాలన్నారు. ఔషధ గుణాలు ఉన్న మొక్కలు నాటి పెంచాలని కోరారు. ప్రతి విద్యార్థి కనీసం పది మొక్కలు నాటాలన్నారు. అనంతరం గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీఓ నేతృత్వంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, పీపుల్స్ ఎన్‌జీవో ప్రతినిధులు, ఎన్‌సీసీ డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్ణిం, మేజర్ శ్రీనివాస్, సుహాన్‌సింగ్ పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఎల్‌టీ కల్నల్ కమాండింగ్ ఆఫీసర్ నీరజ్‌కుమార్

దయనీయంగా పోర్టు కళాసీల జీవనం

- అరకొర వేతనాలు - ఉద్యోగానికి లేని భద్రత

బీచ్‌రోడ్డు, మే 26 (ఆంధ్రజ్యోతి) : కాలుష్యం పొరల్లో మగ్గిపోతూ, ఆర్థికంగా చితికిపోతున్న పోర్టు కళాసీల గోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న ఆలోచన ఏ మాత్రం లేదు. విశాఖ పోర్టులో సుమారు 500 మంది కళాసీలుగా పని చేస్తున్నారు. వారికి ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, సాధారణ ఉద్యోగులకు వర్తించే సౌకర్యాలు ఏవీ వర్తింపజేయడం లేదు. రోజువారీ కూలీల్లా బతుకులు వెళ్లదీస్తున్నారు. కళాసీలను వివిధ విభాగాల్లో వినియోగించుకుంటారు. రోజుకు ఎనిమిది గంటలు డిపార్టుమెంట్‌ల్లో కాలుష్యంతో విలవిల్లాడుతున్నారు. ఇప్పటికే చాలామంది కళాసీలు శ్వాసకోశ ఇబ్బందులతో బాధపడుతున్నారు. వారికి కనీసం వైద్య సౌకర్యం కూడా కల్పించడం లేదు. వేతనం నుంచి ఏటా రూ. 500 మినహాయించుకొని భద్రత పథకం కింద యాజమాన్యం వైద్యం అందిస్తోంది. ఒకవైపు అనారోగ్యం, మరోవైపు ఆర్థిక వెతలు తప్పడం లేదు. వీరికి నెలకు రూ.25 వేల చెల్లిస్తున్నారు. సెలవు పెడితే ఆ మొత్తం కూడా రాదు. నెలలో ఎన్ని రోజులు పని చేస్తే అంతే వేతనం చెల్లిస్తారు.వీరికి ఉద్యోగులకు కల్పించినట్టు పీఎఫ్, టీఏ, కరువు భత్యం వంటి సౌకర్యాలు ఉండవు. ఎక్కడికైనా దూర ప్రాంతాలకు విధులు నిర్వహించేందుకు వెళ్లేటప్పుడు సొంతడబ్బులతో వెళ్లాల్సి వస్తుంది. వచ్చే మొత్తంలో సగం ఇంటి అద్దెకు పోగా కుటుంబ పోషణకు కొందరు చేయి చాపాల్సిన దుర్భర స్థితిలో ఉన్నారు.

పని భారం

సాధారణంగా ఎనిమిది గంటలు డ్యూటీ చేయాల్సి ఉంటుంది. ట్రాఫిక్ సెషన్ అని, ఎలక్ట్రికల్ డ్యూటీ అని సెక్యూరిటీ గార్డులు ఇతర విభాగాల్లో పని చేసేవారికి సాధారణ రోజుల్లో బాగానే ఉంటుంది. పండగలు, ప్రత్యేక సెలవు రోజుల్లో మాత్రం అదనపు డ్యూటీలు తప్పవు. పండగల్లో అదనపు పని చేస్తే కనీసం వేతనంలో ఎటు వంటి మార్పు ఉండదు. పనిభారం అధికంగా ఉంటుంది. సెలవులు కావాలంటే కావాల్సిన రోజులకు వేతనాన్ని నష్టపోక తప్పదు. అలాగే పని చేసే చోట ఉన్నతాధికారులకు పూర్తిగా ఒదిగి ఉండాలి. కొన్ని సందర్భాల్లో తమకు కనీసం గౌరవం కూడా ఉండడం లేదని కొందరు కళాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చెప్పినట్లు నడుచుకోవాల్సిందే. లేకపోతే ఇంటి దారి పట్టాల్సిందే.

కుటుంబానికి దూరం

చాలామంది కళాసీలు విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, ఎస్.కోట, నర్సీపట్నం, పాడేరు తదితర ప్రాం తాల నుంచి ఇక్కడికి వచ్చి పని చేస్తున్నారు. కుటుంబాన్ని వదిలి ఇక్కడికి వచ్చి చాలీచాలని జీతంతో కాలం వెల్లదీస్తున్నారు. సెలవుపై ఇంటికి వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పవు.

అన్ని సదుపాయాలు ఉన్నాయి

ఈ విషయమై పోర్టు ట్రస్ట్ కార్యదర్శి వేణుగోపాలరావు మాట్లాడుతూ కళాసీలకు అన్ని సదుపాయాలు కల్పించామని చెప్పారు. ఉద్యోగ భద్రతకు సంబంధించి కేంద్రం నుంచి ఎటువంటి హామీ రాలేదని పేర్కొన్నారు. కళాసీలకు ఏటా బోనస్ కూడా చెల్లిస్తున్నామని చెప్పారు. వసతి సదుపాయం కూడా కల్పిస్తున్నామన్నారు.


వినతులు స్వీకరిస్తున్న అదనపు కమిషనరు రమణమూర్తి

జీవీఎంసీ పీజీఆర్‌ఎస్‌కు 58 వినతులు

వెంకోజీపాలెం, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు 58 వినతులు వచ్చాయని జీవీఎంసీ అదనపు కమిషనరు డి.వి.రమణమూర్తి తెలిపారు. సోమవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏడీసీ మాట్లాడుతూ నగర వ్యాప్తంగా 58 అర్జీలు అందాయన్నారు. ఒకటో జోన్‌కు 1, రెండో జోన్ 9, మూడో జోన్ 7, నాలుగో జోన్ 7,ఐదో జోన్ 10, ఆరో జోన్ 8, ఎనిమిదో జోన్ 3, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి 13 ఫిర్యాదులు అందాయని తెలిపారు. వీటికి సంబంధించిన విభాగాధిపతులు అర్జీలను పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం


అవగాహన కలిగిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సీఈఓ ఇంతియాజ్ అర్షద్

సిరిపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ (ఎస్‌డీఐ), సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ) ఒప్పందం కుదుర్చుకోవడం సంతోషకరమని స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో ఇంతియాజ్ అర్షద్, సీఐటీడీ డిప్యూటీ డైరెక్టర్ వెంకట అన్నారు. సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ భవనంలో శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో 30 మందికి, ఇండస్ట్రియల్ ఆటోమేషన్ విభాగంలో 30 మందికి నెల రోజులు శిక్షణ ఇస్తారు. ఏదైనా బ్రాంచ్‌కు చివరి సంవత్సరం డిప్లొమో లేదా బీటెక్, ఎంటెక్ చదువుతున్న విద్యార్థులు ఇంటర్న్‌షిప్ అందిస్తామన్నారు. ఈ శిక్షణ వ్యవధి నెల, మూడు నెలలు, ఆరు నెలలు ఉంటుందన్నారు. ఇప్పటికే ఉపాధి పొందుతున్న వారు కూడా మరింతగా తమ నైపుణ్యాన్ని పెంచుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాన్ని అందించే వ్యక్తులకు తర్ఫీదు ఇస్తామన్నారు. ఇతర వివరాలు స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ విశాఖపట్నం కానీ ఫోన్ 79950 14167, వెబ్‌సైట్ డబ్లుడబ్లుడబ్లు.ఎస్‌డీఐవిశాఖ.ఇన్. సంప్రదించవచ్చునన్నారు.

ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలో తనిఖీలు


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ చిన్నంశెట్టి రాజు, తదితరులు

పెదవాల్తేరు,మే 26 (ఆంధ్రజ్యోతి): చినవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆసుపత్రిని సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ చిన్నంశెట్టి రాజు, కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు సందర్శించారు. అమరావతిలోని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు క్యాలెండర్ కార్యాచరణ ప్రకారం చినవాల్తేరులోని ప్రభుత్వ మానసిక రోగుల చికిత్స కేంద్రంలో వార్డులను తనిఖీ చేసి రోగుల మానసిక స్థితి గురించి, అక్కడ సమస్యలు, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. వంటగదిని తనిఖీ చేసి ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ తనిఖీలో ప్రొఫెసర్ డాక్టర్ డి.విజయలక్ష్మి, హెచ్‌వోడీ పారా లీగల్ వాలంటీర్ కె.ఉమామహేశ్వరి తదితరులు పాలొన్నారు.

మహానాడుకు తెలుగు తమ్ముళ్ల పయనం



బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న వెలగపూడి ప్రతాప్ రుద్ర

ఎంవీపీ కాలనీ, మే 26 (ఆంధ్రజ్యోతి): కడపలో భారీ ఏర్పాట్లతో నిర్వహించనున్న తెలుగుదేశం మహానాడు కార్యక్రమానికి తూర్పు నియోజకవర్గం నుంచి సోమవారం ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు బయలుదేరి వెళ్లారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆధ్వర్యంలో మూడు పెద్ద బస్సులు, నాలుగు మినీ బస్సులు, కార్లలో ఉదయం సంపత్ వినాయక ఆలయం వద్ద కొబ్బరికాయ కొట్టి బయలుదేరారు. ఈ కార్యక్రమానికి వెలగపూడి తనయుడు ప్రతాప్ రుద్ర జెండా ఊపి ప్రారంభించారు. నియోజకవర్గం పరిధిలోని పలు వార్డుల నుంచి పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి.

'మావోయిస్టుల మృతదేహాలను బంధువులకు అప్పగించాలి'

సిరిపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాళ్ల కేశవరావు, ఇతరుల మృతదేహాలను బంధువులకు ఏపీ ప్రభుత్వం అప్పగించాలని వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంబాళ్ల కేశవరావు, మరో నలుగురు మరణించి ఐదు రోజులైనా, వారి మృతదేహాలను అప్పజెప్పమని ఏపీ హైకోర్టు ఆదేశించినా ఛత్తీస్‌గఢ్, ఏపీ ప్రభుత్వాలు నాటకాలాడుతూ భౌతికకాయాల్ని అప్పగించకపోవడం దుర్మార్గమన్నారు. వెంటనే మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బాధ్యత వహించి భౌతిక కాయాలకు అంతిమ సంస్కారాలు నిర్వహించుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు అనేక తీర్పుల్లో అంతిమ సంస్కారం నిర్వహించుకునే హక్కు కూడా జీవించే హక్కులో భాగమని చెప్పినప్పటికీ పట్టించుకోకపోవడం రాజ్యాంగ వ్యతిరేక చర్య అని అన్నారు. ఆపరేషన్ కగార్‌ను ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, ఎస్.కె.రెహమాన్, పి.మణి, ఎన్.రవి, సాంబమూర్తి, అబ్బాయిరెడ్డి, ఎం.లక్ష్మి, కె.పద్మ, అన్నపూర్ణ, పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నాయకులు

నిరంతరం వెలుగులే!


పట్టపగలే వెలుగుతున్న వీధి దీపం

మురళీనగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ 50వ వార్డు పరిధి స్కేటింగ్ పార్కు రోడ్డులో వీధి దీపాల నిర్వహణ సక్రమంగా లేక కరెంటు వృథా అవుతోంది. పార్కు ప్రధాన ప్రవేశ ద్వారం ఎదుట రోడ్డులోని వీధి దీపాలు రోజంతా వెలుగుతూ దర్శనమిస్తున్నాయి. పట్ట పగలు ఎండలోనూ దీపాల వెలుగులు కన్పిస్తుండటంతో స్థానికులు పలుమార్లు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. కానీ, ఈ 60 అడుగుల రోడ్డులో వృథాగా వెలుగుతున్న ఈ దీపాల నిర్వహణ గాడిన పడటం లేదు. అవసరమైన చోట దీపాలే కానరావడం లేదు. ఇటీవల 50వ వార్డు తెన్నేటినగర్ ప్రాంత నివాసితుల ఫిర్యాదుల మేరకు వీధి దీపాల నిర్వహణ విభాగం ఏఈ అర్చన వార్డులో పర్యటించినా లైట్ల వ్యవస్థ సక్రమంగా కొనసాగడం లేదు.ఉన్నతాధికారులు ఈ వార్డు పరిస్థితిపై దృష్టిసారించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

రోడ్డుపైనే భవన నిర్మాణ సామగ్రి


జీవీఎంసీ పాఠశాల ప్రహరీ దగ్గరున్న ఇసుక

అక్కయ్యపాలెం, మే 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 26వ వార్డు ఎన్‌జీవో కాలనీలో రోడ్డుపైనే భవన నిర్మాణ సామగ్రి వేయడంతో ట్రాఫిక్ సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రహరీకి ఆనుకుని ఇసుక వేశారు. కొన్ని నెలల క్రితం పాఠశాల అభివృద్ధి పనుల్లో భాగంగా జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడకు రంగులు వేశారు. ఆ గోడల దగ్గర ఇసుకు వేయడంతో రంగులు పోతున్నాయని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పదించి రోడ్లపై భవన నిర్మాణ సామగ్రి వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పౌరాణిక పాత్రలకు ఎన్టీఆర్ పెట్టింది పేరు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రముఖులు

డాబాగార్డెన్స్, మే 26 (ఆంధ్రజ్యోతి): పౌరాణిక పాత్రలకు స్వర్గీయ నందమూరి తారక రామారావు పెట్టిందని పేరని కళా రంగ ప్రముఖులు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పౌర గ్రంథాలయంలో స్వరార్చన భూపతి, స్వరాంజలి కృష్ణంరాజు ఆధ్వర్యంలో సినీసంగీత విభావరి జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా డి.భూపతిరావు, బొడ్డేటి జగత్‌రావు, ఫణిస్వామి, మస్తాన్‌రెడ్డి, నాంచారయ్య, ఎంవీఆర్‌నాగేశ్వరరావు, ఎం.వి. రాజశేఖర్, భయ్యా శ్రీనివాస్ హాజరైయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌరాణిక పాత్రల్లో ఎన్టీఆర్ నటన గురించి కొనియాడారు. అనంతరం ఎన్టీఆర్ నటించిన చిత్రాల నుంచి పలు గీతాలను ఆలపించారు.

అధ్వానంగా తిక్కవానిపాలెం రోడ్డు

కంచరపాలెం, మే 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు తిక్కవానిపాలెం గ్రామానికి గల ప్రధాన రోడ్డు అధ్వానంగా మారడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. మెయిన్ రోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్లే ఈ రోడ్డు పూర్తిగా లోతట్టు కావడంతో పాటు గతుకులమయంగా మారడంతో వాహనాలు జారి ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షం పడితే రోడ్డు మీదే నీరు నిలిచి రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. గతంలో ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు ఈ సమస్య తీసుకువచ్చినా నేటికీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదని వాపోతున్నారు. గ్రామానికి ఆధారమైన ఈ రోడ్డుకు ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. నాయకులు, అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉక్కు యాజమాన్యం కక్ష సాధింపు

... 3వ పేజీ తరువాయి

చేశారు. యాజ మాన్యంతో చర్చలు జరిగాయి. మే నెల 20వ తేదీ వరకు కార్మికులను తొలగించబోమని స్పష్టమైన హామీ ఇచ్చింది. ఆ తరువాత తొలగింపునకు చర్యలు చేపట్టడంతో వారు సమ్మెకు దిగారు. తాజాగా సోమవారం నగరంలో కార్మిక శాఖ అధికారుల వద్ద ఇరువర్గాలకు చర్చలు జరిగాయి. ఇలా చర్చలు జరిగేటప్పుడు జనరల్ మేనేజర్ స్థాయి అధికారి హాజరవుతారు. సోమవారం మాత్రం మేనేజర్ స్థాయి కలిగిన జూనియర్ అధికారిని యాజమాన్యం పంపించింది. యాజమాన్యాన్ని ఒప్పించే స్థాయి ఆ అధికారికి లేదని గుర్తించిన కార్మిక శాఖాధికారి...ఆయన్ను వెనక్కి పంపించేశారు. దాంతో చర్చలు విఫలమయ్యాయి.

దశాబ్దాల కల సాకారం

- ఇకపై రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాలలో ఏడో తరగతి వరకు తరగతులు
- విద్యార్థులకు తప్పిన అవస్థలు


రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాల

కంచరపాలెం, మే 26 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా కొండవాలు గ్రామాల విద్యార్థుల కష్టాలు కడచేరాయి. ఉన్నత పాఠశాల లేకపోవడంతో చదువులకు దూరమయ్యే విద్యార్థుల సంఖ్య ఇకపై తగ్గుతుంది. ఐదో తరగతి పూర్తయిన వెంటనే ఉన్నత పాఠశాలకు వెళ్లాలంటే ఇకపై జాతీయ రహదారిని దాటాల్సిన అవసరం లేదు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పాఠశాల పునవ్యవస్థీకరణలో భాగంగా రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాలను ఏడో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు ఒక ప్రొసీడింగ్ విడుదల చేశారు. దీనిపై కొండవాలు గ్రామాల ప్రజలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంతకముందు పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు మాత్రమే ఉండేది. రాంజీ ఎస్టేట్, కప్పరాడ, బాపూజీనగర్, ఇందిరా నగర్, స్లీపర్ కాలనీ, సురేష్‌రాం నగర్, శ్రీనివాసనగర్, సంజీవయ్య కాలనీ తదితర గ్రామాల విద్యార్థులకు ఈ పాఠశాలే ఆధారం. ఐదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఆరో తరగతిలో చేరడానికి కంచరపాలెంమెట్టు దగ్గర ఉన్న జీవీఎంసీ ఆర్పీపేట ఉన్నత పాఠశాల, కప్పరాడ ఉన్నత పాఠశాకు వెళ్లాల్సి ఉండేది. విద్యార్థులు ఆ పాఠశాలలకు వెళ్లాలంటే జాతీయ రహదారిని దాటాలి. గతంలో ఇలా పాఠశాలలకు వెళ్లి వచ్చే సమయంలో రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. దీంతో ఎక్కువ మంది విద్యార్థులు డ్రాపౌట్లుగా మిగిలిపోయేవారు. ఇక్కడున్న ప్రాథమిక పాఠశాలను, ఉన్నత పాఠశాలగా మార్చమని ఎంతో కాలంగా తల్లిదండ్రులు విజ్ఞప్తులు చేశారు. ఈ సమస్యపై 'ఆంధ్రజ్యోతి'లో పలుమార్లు కథనాలు కూడా ప్రచురితమయ్యాయి.

ఎమ్మెల్యే చొరవతో

ఎమ్మెల్యే విష్ణుకుమార్ ఇక్కడ పాఠశాల సమస్యపై దృష్టిసారించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశించడంతో నెల రోజుల క్రితం డీఈవో స్వయంగా రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలను ఏడో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే ఈ పాఠశాలకు అవసరమైన ఉపాధ్యాయులను నియామకం చేస్తామని చెప్పారు. ఈ పాఠశాలకు ఆరో తరగతికి ప్రవేశాలు జరుగుతాయని తెలిసింది. తమ సమస్య పరిష్కారం చేసినందుకు ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజుకు, అధికారులకు, స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

మహానాడుకు తరలిన టీడీపీ శ్రేణులు


జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న సీతంరాజు సుధాకర్

అక్కయ్యపాలెం/మహారాణిపేట, మే 26 (ఆంధ్రజ్యోతి) :కడపలో మూడు రోజులు జరిగే టీడీపీ మహానాడుకు ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఉత్తర నియోజకవర్గం నుంచి బయలుదేరిన బస్సులను ఎంపీ ఎం. శ్రీభరత్ జెండా ఊపి ప్రారంభించారు. అలాగే దక్షిణ నియోజకవర్గం నుంచి కూడా నాయకులు, కార్యకర్తలు వందలాదిగా తరలివెళ్లారు. పార్టీ కార్యాలయం నుంచి ఎనిమిది బస్సుల్లో వారు బయలుదేరి వెళ్లారు. ఈ బస్సులను దక్షిణ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ జెండా ఊపి ప్రారంభించారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన


సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్న శానిటరీ బృందం

డాబాగార్డెన్స్ మే 26 (ఆంధ్రజ్యోతి) : సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని జీవీఎంసీ 31వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.కామేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం 31వ వార్డులోని పలు ప్రాంతాల్లో సింగిల్ యూస్ ప్లాస్టిక్‌పై ట్విన్‌బిన్స్, ఓపెన్ లెటర్‌పై 31,32,33 వార్డులకు సంబంధించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, మేస్త్రీలు, సూపర్‌వైజర్లు బృందంగా ఏర్పడి ప్రజలకు అవగాహన కల్పించారు.

అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ అంపైర్‌గా నగర వాసి


టేబుల్ టెన్నిస్ శర్మ

విశాఖపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): క్రీడలపై ఆసక్తితో టేబుల్ టెన్నిస్‌లో ప్రావిణ్యం సాధించి జాతీయ స్థాయి క్రీడాకారుడిగా డీవీఎస్వై.శర్మ ఎదిగారు. లెవెల్-1 కోచ్‌గా, అంతర్జాతీయ అంపైర్, టేబుల్ టెన్నిస్ సంఘం కార్యనిర్వాహక ప్రతినిధిగా విశేష సేవలందిస్తూ మార్గదర్శకంగా ఆయన నిలిచారు. జూన్ 15 నుంచి దేశీయ, విదేశీ ఆటగాళ్లతో (ఐపీఎల్ తరహాలో) అహ్మదాబాద్‌లో జరిగే అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ టోర్నీకి, జూన్ 24 నుంచి తాష్కెంట్‌లో జరిగే ఏషియన్ యూత్ టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్ టోర్నీకి అంపైర్‌గా వ్యవహరించనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

విశాఖలోని ఎల్ఐసీ కార్యాలయంలో హైగ్రేడ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శర్మ తనకు ఎంతో ఇష్టమైన టేబుల్ టెన్నిస్‌లో రాణించి అంతర్ ఐఎల్‌సీ టేబుల్ టెన్నిస్ పోటీలలో విజేతగా నిలిచి, జాతీయ స్థాయి క్రీడాకారుడిగా గుర్తింపు పొందారు. ఉత్సాహం ఉన్నవారికి సేవలందించాలనే ఉద్దేశంతో జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘంలో చేరి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. కేవలం సంఘం పరంగానే కాకుండా వ్యక్తిగత సేవ లందించాలనే సంకల్పంతో లెవెల్-1, 2 కోచ్ పరీక్షలలో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించి ఎందరో క్రీడాకారులను తీర్చిదిద్దారు. అంతటితో ఆగకుండా ఆలిండియా టేబుల్ టెన్నిస్ సంఘం నిర్వహించిన జాతీయ స్థాయి రిఫరీ, ఇంటర్నేషనల్ టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ నిర్వహించిన అంతర్జాతీయ రిఫరీ పరీక్షలలో సత్తా చాటి అర్హత సాధించారు. టేబుల్ టెన్నిస్ క్రీడను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలనే సంకల్పంతో స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్‌లో డాక్టరేట్ సాధించి క్రీడపై మక్కువను చాటుకున్నారు.

విశాఖ నుంచి తొలి బ్లూ బ్యాడ్జి అంపైర్‌గా శర్మ

అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ నిర్వహించే బ్లూ బ్యాడ్జి అంపైర్ పరీక్షలలో దేశంలో కేవలం 11 మంది మాత్రమే అర్హత సాధించగా బ్లూ బ్యాడ్జి అంపైర్‌గా విశాఖ నుంచి అర్హత సాధించిన ఏకైక వ్యక్తి డాక్టర్ శర్మ కావడం విశేషం. జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం కార్యదర్శిగా, రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షునిగా సేవలందిస్తున్న శర్మ ఎల్ఐసీ స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు మెంబరుగా పనిచేయడం విశేషం.

దేశవాళి నుంచి అంతర్జాతీయ స్థాయికి

దేశంలో జరిగిన ఖేలో ఇండియా, నేషనల్ గేమ్స్ వంటి అనేక ప్రతిష్ఠాత్మకమైన జాతీయ టేబుల్ టెన్నిస్ టోర్నీలకు అంపైర్‌గా శర్మ వ్యవహరించారు. బ్లూ బ్యాడ్జి అంపైర్‌గా సింగపూర్, హాంగకాంగ్, బ్యాంకాక్, మయన్మార్, నేపాల్, లావోస్ వంటి వివిధ దేశాలలో జరిగిన అంతర్జాతీయ టోర్నీలకు టెక్నికల్ అఫీషియల్‌గా వ్యవహరించారు. ఇటీవలే కేరళలో జరిగిన ఆలిండియా పోలీస్ టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్ టోర్నీకి శర్మను టెక్నికల్ డెలిగేట్‌గా నియమించడం విశేషం. క్రీడాకారుడిగా, కోచ్‌గా, అంపైర్‌గా, సంఘం ప్రతినిధిగా, ఎల్ఐసీ ఉద్యోగిగా బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శిస్తున్న డాక్టర్ శర్మను పలువురు అభినందించారు.

6న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

- ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులకు మేయర్ ఆదేశం

విశాఖపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ సర్వసభ్య సమావేశాన్ని వచ్చే నెల ఆరో తేదీన నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ మేరకు ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదేశించినట్టు సమాచారం. కౌన్సిల్ సమావేశం జరిగి ఆరు దాదాపు ఆరు నెలలు (గత ఏడాది డిసెంబరు తొమ్మిదిన) అవుతోంది. తర్వాత ఎమ్మెల్సీ కోడ్, మేయర్, డిప్యూటీ మేయర్‌లపై అవిశ్వాస తీర్మానం వంటి కారణాలతో కౌన్సిల్ సమావేశం జరగలేదు. మధ్య లో ఒకసారి జరిగినప్పటికీ అది కేవలం 2025-26 బడ్జెట్ ఆమోదానికే పరిమితమైంది. మేయర్‌గా పీలా శ్రీనివాసరావు ఎన్నికైన తర్వాత జరగనున్న మొదటి సమావేశం కావడంతో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. కౌన్సిల్ సమావేశానికి అజెండా రూపకల్పన కోసం కార్పొరేటర్ల నుంచి ప్రతిపాదనలను కోరాలని అధికారులను మేయర్ ఆదేశించారు.ఈనెల 30న కౌన్సిల్ సమావేశం నిర్వహించాలనుకున్నా మహానాడు కారణంగా టీడీపీ కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు అందుబాటులో ఉండే అవకాశం లేనందున వచ్చే నెల ఆరున నిర్వహించాలని మేయర్ నిర్ణయించినట్టు అధికారులు చెబుతున్నారు.


ఫేక్ హాల్ టికెట్లతో కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థినులు, వారి కుటుంబీకులు

విద్యార్థులకు నకిలీ హాల్ టికెట్లు

- పీఎంపాలెంలోని ఓ ప్రైవేటు కళాశాల నిర్వాకం
- ఎంసెట్ పరీక్షకు దూరమైన ఇద్దరు బాలికలు

కొమ్మాది, మే 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల భవిష్యత్‌తో ఓ ప్రైవేటు కళాశాల యాజమాన్యం ఆటలాడుకుంది. ఎంసెట్ పరీక్షకు నకిలీ హాల్ టికెట్లు జారీ చేయడంతో ఇద్దరు విద్యార్థినులు పరీక్షకు దూరమయ్యారు.పీఎంపాలెం పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం.. పీఎంపాలెంలో కేఎంఆర్ పేరుతో ఇంటర్ కళాశాల నడుపుతున్నారు. విద్యార్థులకు ఇంటర్ విద్యతో పాటు ఎంసెట్ కోచింగ్ కూడా ఇచ్చారు. ప్రస్తుతం ఎంసెట్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వాల్సి ఉంది. విజయనగరం జిల్లా గుంప గ్రామానికి చెందిన గొల్లపూడి కావ్యశ్రీ, అనకాపల్లి జిల్లా నర్సీపట్నంకు చెందిన లాలం భాగ్యశ్రీ భవాని కళాశాల వసతి గృహంలో ఉంటూ ఇంటర్‌తో పాటు ఎంసెట్ కోచింగ్ పొందారు. సోమవారం వారు ఎంసెట్‌కు హాజరుకావాల్సి ఉంది.రెండు రోజుల క్రితం హాల్ టికెట్ కావాలని కళాశాల సిబ్బందిని కోరగా ఆన్‌లైన్‌లో పంపిస్తామని చెప్పారు.అలాగే ఆన్‌లైన్‌లో పంపించారు.విద్యార్థినులు సోమవారం జరిగే పరీక్షకు సిద్ధపడగా ఆదివారం వారికి ఆ హాల్ టికెట్లతో పరీక్షకు హాజరుకావద్దని కళాశాల నుంచి సమాచారం అందింది. అవి ఒరిజినల్ కాదని, ఫేక్ అని తెలియడంతో విద్యార్థినులు ఖంగుతిన్నారు. ఆదివారం కళాశాలకు వెళ్లగా అటెండర్ తప్ప ఎవరూ లేకపోవడంతో వెనుతిరిగారు. సోమవారం ఉదయం వెళ్లగా మళ్లీ అదే పరిస్థితి. దీంతో ఫోన్‌లో మేనేజిమెంట్‌ను సంప్రతించగా వారు కూడా స్పందించకపోవడంతో కళాశాల ఎదుట ధర్నాకు దిగారు.ఈవిషయమై పోలీసులు మాట్లాడుతూ ఇరువర్గాలతో చర్చిస్తున్నామన్నారు

విచ్చలవిడిగా పాలిథిన్ వినియోగం



కవర్లు ఉపయోగిస్తున్న వినియోగదారులు

మద్రిపాలెం, మే 26(ఆంధ్రజ్యోతి): ఒకసారి వినియోగించే ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లను వినియోగించొద్దని, వాటి వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, ప్రకృతికి తీవ్ర విఘాతం కలుగుతోందని ప్రభుత్వ అధికారులు పలుమార్లు చెప్పినా వ్యాపారులు యథావిధిగా వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ రహిత విశాఖ కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రజలు మాత్రం పట్టనట్టు పాలథిన్ కవర్లు ఉపయోగిస్తున్నారు. మద్రిపాలెం ప్రాంతంలో ప్రధాన రహదారితో పాటు ఆ ప్రాంతంలో పలు ఉన్న కూరగాయలు, కిరాణ షాపులు, మాంసం దుకాణాలు, టిఫిన్ సెంటర్లు తదితర వ్యాపారులు పాలిథిన్ కవర్లతో పాటు ప్లాస్టిక్ ఉత్పత్తులను అధికంగా వినియోగిస్తున్నారు. వ్యాపారుల కవర్ల వినియోగంపై సచివాలయ సిబ్బందిగాని, జీవీఎంసీ సిబ్బంది గాని కనీసం దృష్టిపెట్టకపోవడంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్లాస్టిక్ వినియోగంపై దృష్టి సారించి తరచూ తనిఖీలు చేపట్టి వినియోగిస్తున్న వ్యాపారులపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పర్యావరణానికి పరోక్షంగా హాని తలపెట్టేవారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆ ముగ్గురే...

... 3వ పేజీ తరువాయి

వహించారని వారిపై కూడా చర్యలు తీసుకోవాలని సిఫారసు చేశారు. నాటి ప్రభుత్వం వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పైగా అదే అధికారులు ఇప్పుడూ కొనసాగుతున్నారు. ఈ ఏడాది చందనోత్సవానికి ముందు సెలవుపై వెళ్లిన ఈఓ త్రినాథరావు సోమవారం వచ్చి విధుల్లో చేరారు. ఏఈఓ ఆనందకుమార్ అదే స్థానంలో విధులు వెలగబెడుతున్నారు. ఈఈ శ్రీనివాసరాజు గోడ కూలిన ఘటనలో సస్పెండయ్యారు. డీఈ రాంబాబుపై కూడా చర్యలు లేవు.

టికెట్ల విక్రయమే పెద్ద కుంభకోణం

ప్రతి ఏటా చందనోత్సవం టికెట్ల విక్రయంలో పెద్ద కుంభకోణం జరుగుతోంది. ఈఓ కార్యాలయం వారికి నచ్చినన్ని టికెట్లు ముద్రించి అమ్ముకుంటోంది. 2023లో ఆలయ అధికారులు నాలుగు వీవీఐపీ టికెట్లు, ఒక కారు పాస్ కలిపి రూ.20 వేలు చొప్పున అమ్ముకున్నారు. నాటి టికెట్ల విక్రయంపై జేసీ విశ్వనాథన్ సుదీర్ఘ నివేదిక అందించారు. ఆ ఏడాది చందనోత్సవం టికెట్ల విక్రయం (48,015) ద్వారా రూ.3.78 కోట్ల ఆదాయం సమకూరింది.

- సమన్వయ సమావేశంలో కలెక్టర్ రూ.1,500 విలువ కలిగిన టికెట్లు 5 వేలు మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. ఆ తరువాత మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశంతో మరో వేయి టికెట్లు అదనంగా ప్రింట్ చేయాల్సిందిగా చెప్పారు. కానీ ఆలయ అధికారులు ఉత్సవం రోజున రాజగోపురం వద్ద తొక్కిసలాట జరుగుతున్నా ఉదయం 11 గంటలకు వీవీఐపీ టికెట్లు అమ్ముతూనే ఉన్నారు. ఆరు వేలకు బదులు 8,707 టికెట్లు విక్రయించారు. అదనంగా విక్రయించిన 2,707 టికెట్లకు కలెక్టర్ అనుమతి లేదు. దీనిపైనే ఈఓ, ఏఈఓలపై చర్యలు తీసుకోవాలని జేసీ సిఫారసు చేశారు. అంతకు ముందు ఏడాది 2022లో 31,486 టికెట్లు మాత్రమే విక్రయించగా 2023లో అదనంగా 17 వేలు అమ్మారు.
- వాహనాల పాస్‌లు ఇష్టం వచ్చినట్టు ఉపయోగించుకున్నారు. మొత్తం 697 పాస్‌లు జారీ చేయగా వాటిలో పోలీస్ శాఖ 258 పాస్‌లు తీసుకుందని తేలింది. దీనికి వారి నుంచి సరైన సమాధానం అందలేదు. సిబ్బందికి పాస్‌లు పేరుతో వాటిని వీవీఐపీలకు అమ్ముకున్నట్టు తేలింది.
- ఉత్సవం ప్రత్యేక అధికారిగా నియమితులైన చంద్రశేఖర ఆజాద్ జేసీ విచారణకు హాజరు కాలేదు. తనకు ఉత్సవంలో ఎటువంటి బాధ్యతలు అప్పగించలేదని, అందువల్ల తనకు సంబంధం లేదని సమాధానమిచ్చారు. దీనిని బాధ్యతారాహిత్యంగా పేర్కొంటూ చర్యలకు సిఫారసు చేశారు.

ఇప్పుడైనా స్పందించాలి

చందనోత్సవం నిర్వహణలో పదేపదే తప్పులు చేస్తూ సొంత లాభం చూసుకుంటున్న వారిపై ఇప్పటికైనా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. దేవస్థానంలో పాతుకుపోయి, ఏకంగా ఉత్సవానికే చెడ్డపేరు తెస్తున్న వారిని ఇప్పుడు జరుగుతున్న బదిలీల్లో అయినా ఇక్కడి నుంచి పంపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనా, జిల్లా నాయకులపైనా ఉంది.

కూటమిలో కోడి వ్యర్థాల దుమారం

... 3వ పేజీ తరువాయి

వేస్తుండడంతో వాటికి డిమాండ్ పెరిగింది. దీంతో చికెన్ వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించాల్సిన కాంట్రాక్టర్లు వ్యర్థాలను చేపల చెరువుల యజమానులకు విక్రయించడం మొదలుపెట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు తమకు లంచాలు ముట్టజెప్పిన వారికే చికెన్ వ్యర్థాల సేకరణ టెండర్లు దక్కేలా చక్రంతిప్పారు. దీనిపై గత ఏడాది తీవ్రస్థాయిలో దుమారం రేగడంతో అప్పటి కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా జోన్‌లవారీగా టెండర్లు పిలిచారు. సేకరించిన వ్యర్థాలను నేరుగా కాపులుప్పాడ డంపింగ్‌యార్డుకు తరలించాల్సిందేనని నిబంధన పెట్టారు. అయితే కూటమి ప్రజా ప్రతినిధులు తమ అనుచరులకు ఏదో ఒక జోన్ ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో టెండర్ నియమ నిబంధనలను పక్కనపెట్టేసి ఒక్కో ప్రజా ప్రతినిధికి ఒక్కొక్క జోన్ కేటాయించినట్టు సమాచారం. అయితే ఆ నియోజకవర్గంలో మిగిలిన కూటమి నేతలు తమ అనుచరులకు అవకాశం దక్కకపోవడంతో కోపంతో రగిలిపోతున్నారు. చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాలు అనధికారికంగా సేకరించుకోవాల్సిందిగా తమ అనుచరులను ప్రోత్సహించడం మొదలుపెట్టారు. అనధికారికంగా వ్యర్థాలను సేకరిస్తున్నారంటూ టెండరు దక్కించుకున్నవారు తమ అస్మదీయులైన నేతల వద్దకు వెళ్లి ఫిర్యాదు చేస్తున్నారు. దీనికి స్పందించిన నేతలు అలా వ్యర్థాలను సేకరించే వాహనాలను పట్టుకుని కేసులు నమోదుచేయాలని అధికారులను ఆదేశిస్తున్నారు. నేతల ఆదేశాల మేరకు అధికారులు వెళ్లి వాహనాలను పట్టుకుంటే మరో నేత వెంటనే రంగంలోకి దిగి పట్టుకున్న వాహనాలను వదిలిపెట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో అధికారులు నలిగిపోతున్నారు.

కూటమి నేతల మధ్య తారస్థాయికి చేరిన చిచ్చు

దక్షిణ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఒక జోన్‌లో చికెన్ వ్యర్థాల సేకరణ టెండర్ కోసం ఇద్దరు నేతల అనుచరులు పోటీపడ్డారు. అనూహ్యంగా వారిద్దరికీ కాకుండా మరో నియోజకవర్గానికి చెందిన ప్రజా ప్రతినిధి సిఫారసు చేసిన వారికి టెండర్‌ను అధికారులు కేటాయించారు. దీంతో ఒక నేత నియోజకవర్గ పరిధిలోని కొన్ని దుకాణాల నుంచి వ్యర్థాలు సేకరించుకోవాలని తన అనుచరుడికి పురమాయించారు. అతను మూడు వాహనాలు పెట్టుకుని చికెన్ వ్యర్థాలను సేకరించి అనకాపల్లి జిల్లాలోని చేపల చెరువులకు తరలిస్తుండగా, టెండరు దక్కించుకున్న వ్యక్తి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. విషయం సదరు నేతకు తెలియడంతో ఆగమేఘాల మీద వాహనాలు ఉంచిన పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులపై కేకలు వేశారు. చికెన్ వ్యర్థాలను కాపులుప్పాడ తరలించకుండా చేపల చెరువులకు తరలిస్తున్న కాంట్రాక్టర్‌పై ఎందుకు చర్యలు తీసుకోరని ఎస్ఐపై అరవడంతో ఆ వాహనాలను విడిచిపెట్టేశారు. అదే నియోజకవర్గానికి చెందిన మరొక నేత కూడా తన అనుచరుడికి టెండరు రాకపోవడంతో అనధికారికంగా సేకరించుకోవాలని అభయం ఇచ్చారు. దీంతో అతడు వ్యర్థాలను సేకరించి అనకాపల్లి వైపు వెళుతుండగా నరవ వద్ద మూడు వాహనాలను జీవీఎంసీ అధికారులు పట్టుకున్నారు. వెంటనే సదరు నేత రంగంలోకి దిగి ఆ వాహనాలను విడిచిపెట్టకపోతే తీవ్రపరిణామాలు తప్పవంటూ హెచ్చరించారు. జోన్-2 పరిధిలోకి వచ్చే ఒక నియోజకవర్గ నేత వద్ద పీఏగా పనిచేసిన వ్యక్తే బినామీ పేరుతో చికెన్ వ్యర్థాల సేకరణ కాంట్రాక్టు దక్కించుకున్నారనే ప్రచారం జరుగుతోంది. నగరమంతా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. కూటమిలోని ఒక పార్టీ నేత ఒకరికి మద్దతుగా ఉంటే...మరో పార్టీ నేత మరొకరికి మద్దతుగా నిలుస్తున్నారు. నేతల మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరు ప్రభావం ప్రభుత్వంపై పడుతుందంటూ ఒక ప్రజా ప్రతినిధి నేరుగా జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి చికెన్ వ్యర్థాల టెండర్లను రద్దు చేయాలని కోరినట్టు సమాచారం.

ఆర్ఈసీఎస్ సొమ్ములు స్వాహా

... 3వ పేజీ తరువాయి

డీఈని నియమించి వ్యవహారాలు నడుపుతోంది. అయితే సొసైటీకి చెందిన అప్పులు, ఆస్తుల లెక్క తేలలేదు. సొసైటీ బాధ్యులు పూర్తి వివరాలు అందించకపోవడం వల్ల అవన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. ఆ డివిజన్‌కు యథాప్రకారం విద్యుత్ సరఫరా చేసి, బిల్లులు వసూలు చేసి, సొసైటీ ఉద్యోగులకు ఈపీడీసీఎల్ జీతాలు చెల్లిస్తోంది. నిర్వహణ వ్యయం అంతా భరిస్తోంది. ఇవన్నీ వేరే బ్యాంకు ఖాతాల ద్వారా జరుగుతున్నాయి.

ఎవరి అనుమతితో తరలించారు?

ఇదిలావుండగా సొసైటీని స్వాధీనం చేసుకున్నప్పుడు అప్పటికే వారు విద్యుత్ పనుల నిర్వహణ కోసం సమకూర్చుకున్న పది కోట్ల రూపాయల విలువ చేసే మెటీరియల్ కశింకోటలోని ఆర్ఈసీఎస్ స్టోర్స్‌లో ఉంది. దానిని అక్కడి నుంచి సింహాచలంలో ఈపీడీసీఎల్ స్టోర్స్‌కు తరలించాలని విశాఖపట్నంలోని కార్పొరేట్ కార్యాలయంలోని సీజీఎం ఒకరు ఆదేశించారు. దాంతో కశింకోట ఆర్ఈసీఎస్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) దగ్గరుండి పంపించేశారు. ఈపీడీసీఎల్‌కు చెందిన వాహనాలతో సిబ్బంది సుమారు రెండు వారాలు తరలింపు ప్రక్రియ చేపట్టారు. ఇది గత ఏడాది ఆగస్టులో పూర్తయింది. ఇలాంటి వ్యవహారాలు నిర్వహించినప్పుడు ఏయే రకాల మెటీరియల్ ఎంత పంపించారు?, ఎక్కడికి పంపించారు?, వాటి విలువ ఎంత?...అనే వివరాలు రికార్డుల్లో నమోదు చేయాల్సి ఉంటుంది. పైగా అప్పులు, ఆస్తుల లెక్క తేలనందున వాటిని ప్రత్యేక అనుమతులు ఉంటే తప్ప వినియోగించుకోవడానికి వీల్లేదు. ఈ నిబంధనను కూడా అధికారులు ఉల్లంఘించారు.

లోడింగ్, రవాణా చార్జీల క్లెయిమ్

మెటీరియల్‌ను సింహాచలం డిపోకు తరలించడానికి కార్పొరేట్ కార్యాలయం ఈపీడీసీఎల్ సిబ్బందిని, వాహనాలను పంపించింది. అంటే వారి పనులు వారే చేసుకున్నారు. దీనికి కశింకోట ఆర్ఈసీఎస్ డివిజన్ ఈఈ రవాణా చార్జీలు ఇవ్వాలంటూ రూ.19.64 లక్షలకు బిల్లు పెట్టారు. ఇండోర్, అవుట్ డోర్ మెటీరియల్‌ను వాహనాల్లో లోడింగ్ చేయడానికి, తరలింపునకు ఉపయోగించిన వాహనాలకు అద్దెలు చెల్లించడానికి ఈ వ్యయం అయిందని బిల్లు పెట్టుకున్నారు. ఈ బిల్లు మొత్తం ఎవరెవరు పంచుకున్నారంటే...కార్పొరేట్ కార్యాలయం, కశింకోట డివిజన్ అధికారుల పేర్లు వినిపిస్తున్నాయి.

ఆర్టీఐలో అడిగితే డొంక తిరుగుడు సమాధానం

కశింకోట ఆర్ఈసీఎస్ అవకతవకలపై అనేక ప్రచారాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ మెటీరియల్ తరలింపుపై వివరాలు కోరుతూ సమాచార హక్కు చట్టం కింద ఒకరు దరఖాస్తు చేశారు. మెటీరియల్ తరలింపునకు అనుమతి ఇచ్చింది ఎవరు?, ఎంత ఖరీదు, ఏయే మెటీరియల్ అనే వివరాలు కోరారు. కశింకోట అధికారులు దానికి సమాధానం ఇవ్వకుండా ఆ లేఖను సింహాచలం డిపోనకు బదిలీ చేశారు. బాధ్యతాయుతమైన స్థానంలో ఉండి కోట్లాది రూపాయల విలువైన సామగ్రిని అప్పగించడమే కాకుండా ఆ వివరాలు లేవని చెప్పడాన్ని దరఖాస్తుదారు తీవ్రంగా తప్పుబట్టి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

వేతనాలివ్వడం లేదని సీపీకి ఫిర్యాదు

మహారాణిపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకుండా తమ ను వరూష్ టెక్నాలజీస్ సంస్థ వేధిస్తోందని ఆ సంస్థలో వెబ్‌డిజైనర్‌గా పనిచేస్తున్న టి. సేతువర్ధన్ సీపీకి ఫిర్యాదు చేశారు. వరూష్ కంపెనీపై తగిన చర్యలు తీసుకోవాలని కమిషర్ శంఖబ్రత బాగ్చిని కోరారు.

ఫలించిన మండల విద్యాశాఖాధికారుల కృషి

- 250 మంది డ్రాపౌట్స్ విద్యార్థులు 12న పాఠశాలల్లో చేరేందుకు సిద్ధం
- లభ్యం కాని 70 మంది చిన్నారుల చిరునామాలు
- పిల్లలతో పాటు తల్లిదండ్రులు తమ స్వస్థలాలకు వెళ్లిపోవడమే కారణం

పెదగంట్యాడ, మే 26 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ అధికారులు చేసిన కృషి ఫలించడంతో మండల పరిధిలోని 250 మంది డ్రాపౌట్ విద్యార్థులు మళ్లీ పాఠశాలల్లో చేరేందుకు సిద్ధమయ్యారు. వేసవి సెలవుల అనంతరం జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. అదేరోజున వీరంతా పాఠశాలల్లో చేరనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేసినట్టు మండల విద్యాశాఖాధికారులు తెలిపారు. మండలంలో 32 ప్రాథమిక పాఠశాలలు, మూడు జడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా స్కూళ్లలో విద్యనభ్యసించిన 320 మంది విద్యార్థులు విద్యా సంవత్సరం మధ్యలోనే మానేసినట్టు ఎంఈవో గుర్తించారు. దీంతో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి డ్రాపౌట్స్ పిల్లల జాబితాను విద్యాశాఖాధికారులు సేకరించారు. డ్రాపౌట్స్ పిల్లల చిరునామాల మేరకు వారికి దగ్గరలోని అంగన్‌వాడీ టీచర్లకు, సచివాలయాల మహిళా



మండల విద్యాశాఖ కార్యాలయం



ఈ.శ్రీనివాసరావు



కె.రమణాజీ

పోలీసులకు, వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీకి, భవిత కేంద్రాల ఆర్గనైజర్లకు, సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులకు డ్రాపౌట్స్ జాబితాలను అందజేసి, డ్రాపౌట్స్‌కు గల కారణాలపై సర్వే చేయించారు. ఇంటి పనుల్లో తల్లిదండ్రులకు సాయం చేసేందుకు కొందరు చిన్నారులు బడి మానేశారు. కూలి పనుల నిమిత్తం తల్లిదండ్రులు వేరే ప్రాంతానికి వలస వెళ్లడంతో వల్ల మరికొందరు చిన్నారులు, తల్లిదండ్రులకు ఆర్థికంగా అండగా ఉండేందుకు ఇంకొందరు విద్యార్థులు కూలి పనుల్లో చేరారు. వివిధ రాష్ట్రాల నుంచి ఉపాధి నిమిత్తం ఇక్కడకు వచ్చిన పలు కుటుంబాలు తిరిగి తమ స్వస్థలాలకు వెళ్లిపోవడంతో ఈ డ్రాపౌట్స్ వచ్చినట్టు గుర్తించారు.

చదువు ప్రాముఖ్యతను వివరించి..

డ్రాపౌట్ అయిన ప్రతి విద్యార్థి ఇంటికి అంగన్‌వాడీ టీచర్లు, మహిళా పోలీస్, స్థానికంగా ఉన్న ఉపాధ్యాయులు, వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీ వెళ్లి వారి తల్లిదండ్రులకు చదువు వల్ల చేకూరే ప్రయోజనాలను వివరించారు. చదువుకోవడం వల్ల వచ్చే ఫలితాలు, చదువు మానేయడం వల్ల కలిగే నష్టాలపై వారికి అవగాహన కల్పించారు. అంతేకాక చిన్నారులను కూలి పనులకు పంపితే చట్టరీత్యా తీసుకునే చర్యలను తెలియజేశారు. దీంతో తమ పిల్లలకు తిరిగి పాఠశాలలకు పంపేందుకు తల్లిదండ్రులు అంగీకరించడంతో 250 మంది జూన్ 12 పాఠశాలల్లో చేరనున్నారు.

70 మంది చిరునామాల గల్లంతు

కాగా డ్రాపౌట్స్ అయిన 70 మంది విద్యార్థుల చిరునామాలు గల్లంతయ్యాయి. స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు, పెదగంట్యాడ పారిశ్రామికవాడ, తదితర సంస్థల్లో కూలి పనులు చేసేందుకు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బిహార్, తమిళనాడుతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వివిధ జిల్లాల నుంచి పలు కుటుంబాలు కూలి పనుల నిమిత్తం ఇక్కడకు వచ్చాయి. అయితే ఇలా వచ్చిన వారిలో చాలామంది వివిధ కారణాలతో తిరిగి తమ స్వస్థలాలకు వెళ్లిపోవడంతో వారి పిల్లలు బడి మానేశారు. ఇలా 70 మంది చిన్నారుల చిరునామాలు లభ్యం కాలేదని ఎంఈవో-1 ఈ.శ్రీనివాసరావు, ఎంఈవో-2 కె.రమణాజీలు అభిప్రాయ పడుతున్నారు.



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న నల్లూరు సూర్యనారాయణ

మహానాడుకు తరలిన తెలుగు తమ్ముళ్లు

కూర్మన్నపాలెం, మే 26 (ఆంధ్రజ్యోతి): కడపలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న టీడీపీ మహానాడు కార్యక్రమంలో పాల్గొనేందుకు పార్టీ 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు బయలుదేరి వెళారు. ఈ మేరకు బస్సును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. తొలుత ఇక్కడి ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నల్లూరు మాట్లాడుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రైళ్లు, బస్సులు, కార్లతో మహానాడుకు పయనమయ్యామన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలంటూ తెలుగు మహిళలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, మానాపురం గణపతి, సుబ్బయ్య, నాగార్జున, జగదీశ్, వెంకటేశ్, లోవరాజు, తదితరులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరగనున్న మహానాడులో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ కోరారు. మహానాడుకు తెలుగు తమ్ముళ్లు తరలిన వాహనాలకు ఆయన జెండా ఊపారు. నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్‌రాజు, డీవీ అప్పారావు, ఎస్.పెంటారావు, వి.రాంబాబు, కె.శ్రీనివాసనాయుడు, ఎం.రాము, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: టీడీపీ మహానాడులో పాల్గొనేందుకు పెదగంట్యాడ నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. టీడీపీ సీనియర్ నాయకులతో పాటు వార్డు కమిటీల అధ్యక్ష, కార్యదర్శుల ఆధ్వర్యంలో కార్యకర్తలు రెండు బస్సుల్లో కడప బయలుదేరారు. నాయకులు నమ్మి అప్పారావు, ములకలపల్లి పెంటయ్యలు సారథ్యంసారధ్యం వహించారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

అగనంపూడి, మే 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఇమ్మరిపాలెం, శ్రీరామ్‌నగర్ కాలనీల్లో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు సోమవారం కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి సమస్యలు నెలకొన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పంచకర్ల ప్రసాద్, దుల్ల రాము నాయుడు, ఇల్లపు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు

ఆటోనగర్, మే 26 (ఆంధ్రజ్యోతి) ఆంధ్రా యూనివర్సిటీ విడుదల చేసిన బీకామ్ కంప్యూటర్స్ ఫలితాల్లో శ్రీనగర్ టీఎస్సార్ టీబీకే కళాశాల విద్యార్థిని టి.పావని మూడో ర్యాంకు సాధించడంతో కాలేజీ చైర్మన్ తలశిల బలరామకృష్ణ సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. మిగతా విద్యార్థులందరూ పావనిని ఆదర్శంగా తీసుకోవాలి సూచించారు. అదేవిధంగా పావనికి ప్రిన్సిపాల్ ఎస్.వి ష్ణువర్ధన్, కరస్పాండెంట్ తలశిల ఉమామహేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ సుభాషిణి, అధ్యాపకుడు శ్రీనివాసరావు, తదితరులు అభినందనలు తెలిపారు.



పావనికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాలేజీ చైర్మన్ తలశిల బలరామకృష్ణ

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

హోమియో వైద్యురాలు శ్రీదేవి

అక్కిరెడ్డిపాలెం, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాంత్రిక యుగంలో మానసిక ప్రశాంతతకు, సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని మింది ప్రభుత్వ హోమియో వైద్యురాలు రాపేటి శ్రీదేవి అన్నారు. మిందిలోని సీనియర్ సిటిజన్ అసోసియేషన్, ప్రభుత్వ హోమియో వైద్య సిబ్బంది సంయుక్తంగా సోమవారం నిర్వహించిన యోగా దినోత్సవ ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా అందరూ యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని కోరారు. ర్యాలీలో అసోసియేషన్ ప్రతినిధులు, మహిళా సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

గాజువాక, మే 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా సోమవారం పలు పాఠశాలల విద్యార్థులకు క్రీడా పోటీలు పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కథలు చదవడం, రాయడంలో చిన్నారు లకు తర్ఫీదు ఇచ్చారు. రోజూ విద్యార్థు లకు కొత్త విజ్ఞానంపై అవగాహన కల్పిస్తున్నామని లైబ్రేరియన్ బి.చంద్రకళ తెలిపారు.

'దళిత యువకులపై పోలీసుల దాడి సమంజసం కాదు'

ఉక్కుటౌన్‌షిప్, మే 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తెనాలిలో పట్టపగలు రోడ్డుమీద దళిత యువకులపై పోలీసులు దాడి చేయడం సరికాదని, తప్పు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలే తప్పా దాడికి పాల్పడడం భావ్యం కాదని స్టీల్ ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.మోహన్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దళిత యువకులను భయభ్రాంతులకు గురిచేసేలా పోలీసులు దాడి చేయటంతో దళిత జాతి భయపడుతుందన్నారు. ఈ వ్యవహారాన్ని కోర్టు సుమోటాగా తీసుకోవాలని కోరారు.

సినిమా గైడ్

- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం)
- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **నిశ్శబ్దప్రేమ** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం),
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: రమాదేవి, సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 15, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 18, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 32, బీరకాయలు 36, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజీ 16, క్యారెట్ 40 దొండకాయలు 18, బంగాళదుంపలు 18, అరటికాయ (పెద్దది) 9, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది)54, బరబాటి 24, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 40, దోసకాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 98, కీరదోస 30, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 44, గోరుచిక్కుడు 32, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, బూడిద గుమ్మడికాయ 20, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230



కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న షేక్ రెహమాన్



స్టీల్‌ప్లాంట్ ప్రధాన గేటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఉక్కు కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్

కూర్మన్నపాలెం, మే 26 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సీపీఐ జిల్లా సీపీఐ కార్యదర్శి షేక్ రెహమాన్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,566వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన దీక్షా శిబిరానికి విచ్చేసి కాంట్రాక్టు కార్మికులకు సంఘీభావం తెలిపారు. అనంతరం షేక్ రెహమాన్ మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విమర్శించారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్లాంటుకు రూ.11 వేల కోట్లు ఇచ్చామని కేంద్ర ప్రభుత్వం చెబుతుందని, ఇందులో రూ.8 వేల కోట్లను బ్యాంకు రుణాల కింద తీసుకున్నారన్నారు. మిగిలిన రూ.3 వేల కోట్లు ఇవ్వాలంటే ఐదు వేల మంది ఉద్యోగులను తొలగించాలన్న నిబంధనను పెట్టడం దారుణమన్నారు. ఉక్కు కర్మాగారానికి భూములిచ్చిన రైతులకు, ఉక్కు నిర్వాసితులకు ఇప్పటివరకు న్యాయం జరగలేదన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కాంటాకర్టు కార్మికులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల డిమాండ్లను యాజమాన్యం పరిష్కరించి, వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలంటూ కర్మాగారం ప్రధాన గేటు వద్ద కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్న కార్మికులపై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్టు కార్మికులకు యాజమాన్యం సౌకర్యాలను కల్పించాలని కోరారు.

ఆర్ఎల్‌సీ సమక్షంలో జరిగిన చర్చలు వాయిదా

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు, అధికారులకు ఆర్ఎల్‌సీ (రీజనల్ లేబర్ కమిషనర్) సమక్షంలో నగరంలో సోమవారం జరిగిన చర్చలు ఈ నెల 30వ తేదీకి వాయిదా పడ్డాయి. ప్రస్తుతం కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్న నేపథ్యంలో ఈ చర్చల పట్ల అందరూ ఆసక్తిగా చూశారు. యాజమాన్యం నుంచి ఏ నిర్ణయం వస్తుందోనని కార్మికవర్గం ఎదురుచూసింది. అయితే ఎటువంటి చర్చలు జరగకుండానే 30వ తేదీకి వాయిదా పడినట్టు నాయకులు తెలిపారు. యాజమాన్యం నుంచి ఉన్నతాధికారులు చర్చలకు హాజరు కాలేదని, కార్మిక వర్గంపై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలకు చేయూత

అగనంపూడి, మే 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి చట్టివానిపాలెంలో ఇటీవల మృతి చెందిన పలు కార్మిక కుటుంబాలకు స్థానిక శ్రీకృష్ణ యువజన సంఘం చేయూతనందించింది. పీకే చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పల్లా కార్తీక్ పలు కుటుంబాలకు సోమవారం నిత్యావసర సరకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలను ఆదుకోవాల్సిన బాధ్యతపై అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మొల్లి కోటి, బి.సత్యనారాయణ, అప్పారావు, రమణ, పైడినాయుడు, రాజు, గోవింద, శ్రీను, అప్పలరాజు, తదితరులు పాలొన్నారు.

సాగు సాయానికి సన్నాహాలు

- 'అన్నదాత సుఖీభవ' కింద అర్హులైన రైతులకు ఆర్థిక సాయం
- అర్హుల ఎంపిక ఆరంభం
- వివరాల పరిశీలనలో వ్యవసాయ సిబ్బంది
- పెందుర్తి మండల వ్యాప్తంగా 3,970 మంది అప్‌లోడ్

పెందుర్తి, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో హామీల అమలుకు కూటమి సర్కారు ప్రత్యేక దృష్టి సారిస్తుంది. ఇందులో భాగంగా అన్నివర్గాల ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా రైతులకు బాసటగా నిలిచేందుకు అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రవేశపెడుతుంది. తద్వారా పెట్టుబడి సాయం కింద ప్రతి రైతుకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందించనుంది. ఇందుకు సంబంధించిన గడువు సోమవారంతో ముగియడంతో పెందుర్తి మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో లబ్ధిదారులు ఎంపిక ప్రక్రియ ఆరంభమైంది. రైతు సేవా కేంద్రాల్లో పథకం కోసం రైతులు అందించిన ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ లింకుతో కూడిన సెల్‌ఫోన్ నెంబర్, పంట వివరాలతో నమోదైన వెబ్ ల్యాండ్ డేటాను వ్యవసాయాధికారులు పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 3,970 మంది రైతుల ఖాతాలను అప్‌లోడ్ చేసి అప్రూవల్ చేయడం జరిగిందన్నారు. అర్హులైన రైతులను ఎంపిక చేసి వారి బ్యాంకు ఖాతాలకు పెట్టుబడి సాయం కింద నగదు జమ చేయనున్నామన్నారు. ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్న రైతులు తమ దరఖాస్తు స్టేటస్‌ను ఆన్‌లైన్‌లో తనిఖీ చేసుకోవచ్చునని ఆయన వివరించారు.



నరవ రైతుల వివరాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి దుర్గాప్రసాద్, సిబ్బంది

ఘనంగా పెంటమాంబ వేడుక

మల్కాపురం, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి హిమాచల్‌నగర్‌లో పెంటమాంబ మారువారం పండుగను సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ నమ్మి గౌరీశ్వరరావు ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. పారిశ్రామికప్రాంతం నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది. మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి , 59వ వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ సురేష్‌యాదవ్, స్థానిక నాయకులు పొట్టిమూర్తి, లుకేష కన్‌స్ట్రక్షన్ అధినేత ముంగర నరేంద్ర నారాయణ రాజు, అడ్వకేట్ కోలా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు గండేపల్లి షణ్ముఖ గుర్నాథరావు, గౌరవాధ్యక్షులు రంగుభక్తు అప్పలరాజు, కార్యదర్శి సాలాపు రవి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పూజలందుకున్న అమ్మ

మహానాడుకు తరలి వెళ్లిన టీడీపీ శ్రేణులు

పెందుర్తి, మే 26 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లాలో మంగళవారం నుంచి జరగనున్న మహానాడుకు పెందుర్తి నియోజకవర్గ నుంచి సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ నేతృత్వంలో ఇక్కడి తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి ప్రత్యేక బస్సుల్లో బయల్దేరగా, మొగలిపురం ఎంపీటీసీ సభ్యుడు తమరాన బంగారునాయుడు జెండా ఊపి ప్రారంభించారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు రెడ్డి నారాయణరావు ఆధ్వర్యంలో టీడీపీ మండల నాయకులు మహానాడుకు కార్లలో తరలివెళారు. సీనియర్ నేత అవగడ్డ అప్పలనాయుడు, దూది రమణ, గంగాధర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



మహానాడుకు వెళుతున్న పెందుర్తి టీడీపీ నేతలు

మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతం నుంచి మహానాడుకు టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. 40, 58 నుంచి 63వార్డుల పరిధిలో ఉన్న వార్డుల టీడీపీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) ఆదేశాల మేరకు పయనమయ్యారు. కొందరు ప్రత్యేక బస్సుల్లో, మరికొందరు వేర్వేరు వాహనాల్లో వెళ్లారు.

విభిన్న ప్రతిభావంతుల గుర్తింపునకు సర్వే

గోపాలపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి) : విభిన్న ప్రతిభావంతులైన పిల్లలను భవిత కేంద్రాలకు పంపడం ద్వారా వారి భవిష్యత్తుకు భరోసా కల్పించవచ్చని సమగ్ర శిక్ష అభియాన్ కో-ఆర్డినేటర్ బి.గీత పిలుపునిచ్చారు. లక్ష్మీనగర్‌లోని భవిత సెంటర్ పరిధిలో సోమవారం ఇంటింట సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవ గాహన కల్పించారు. ఇటువంటి పిల్లలను భవిత సెంటర్‌లో చేర్పించడం వలన వారిలో నైపుణ్యాలను మెరుగుపర్చడంతో పాటు విద్య, వైద్య సేవలు అందిస్తారస్తారన్నారు. అలాగే, భవిత కేంద్రంలో విద్యాభ్యాసం చేసేవారికి స్కాలర్‌షిప్‌లు, వారిని కేంద్రానికి తీసుకువచ్చే వారికి ఎస్కార్ట్ అలవెన్స్ ట్రావెల్ అలవెన్స్‌లు ఉంటాయని వివరించారు. పాఠశాల హెచ్‌ఎం ఎం.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనగర్‌లో ఇంటింట సర్వేలో కో-ఆర్డినేటర్ గీత తదితరులు

నేడు సరిపల్లిలో పరదేశిమాంబ పండుగ



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

పెందుర్తి, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సరిపల్లిలో పరదేశిమాంబ పండుగ మంగళవారం జరగనుంది. ఇందులో భాగంగా సోమవారం తొలేళ్ల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, కోలాటం నడుమ అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. ఆలయం నుంచి గ్రామం వరకు విద్యుద్దీపాలంకరణ చేపట్టడంతో సందడి వాతావరణం నెలకొంది.

'విద్యార్థులు అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి'

మల్కాపురం, మే 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులంతా అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ ఆఫీసర్ ఇపీఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాన్ని సోమవారం సందర్శించి మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. నిత్యం గ్రంథాలయాలను సందర్శించడం ద్వారా విజ్ఞానాన్ని పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్‌తో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు

వేపగుంట, మే 26 (ఆంధ్రజ్యోతి) : వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు అందినట్టు జోనల్ కమిషనర్ కె.హైమావతి తెలిపారు. వీటిలో 93వ వార్డులో కేబుల్ వైర్లు రహదారిపై ఇబ్బందిగా ఉన్నాయని, 95వ వార్డు లక్ష్మీపురం రెవెన్యూ విలేజ్ సర్వే నెంబరు 80/6లో అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలని, 97వ వార్డు సుజాతానగర్ ఆర్చ్ దగ్గరలో కల్యాణ మండపం అక్రమంగా నిర్మాణం చేస్తున్నారని పేర్కొంటూ అర్జీలను అందజేశారన్నారు. అలాగే, చిన ముషిడివాడ సాయినగర్ అండర్ గ్రౌండ్ డ్రేనేజీ సమస్యను పరిష్కరించాలని, 98వ వార్డు సాయిమాధవనగర్‌లో వాటర్ పైపులైన్ లీకేజీని అరికట్టాలని విన్నవించినట్టు చెప్పారు.

సింహాచల దేవస్థానం ప్రధాన అర్చకుడిగా సీతారామాచార్యులు

సింహాచలం,మే 26 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రధానార్చకుడు (2)గా కరి సీతారామాచార్యులకు పదోన్నతి కల్పిస్తూ దేవస్థానం ఈఓ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ప్రధానార్చకుడు-2గా విధులు నిర్వర్తించిన ఇరగవరపు వెంకట రమణాచార్యులు ఈనెల 21న గుండె పోటుతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో ఉప ప్రధానార్చకుడిగా ఉన్న సీతారామాచార్యులకు పదోన్నతి కల్పించారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాద వేద ఆగమ పాఠశాలలో పాంచరాత్రాగమశాస్త్రంలో తర్ఫీదు పొందిన సీతారామాచార్యులు ఇటీవల తిరుమల వేంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ నుంచి ఆగమ శాస్త్ర పండితుడిగా సత్కారం అందుకున్నారు.



విద్యార్థినులు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

మల్కాపురం, మే 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ఉన్నత పాఠశాలలో ప్రపంచ రుతుక్రమ ఆరోగ్యపరిరక్షణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సృజన వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ పాఠశాలలకు వెళ్లే బాలికలు రుతుక్రమ సమయంలో ఇంట్లో, పాఠశాలలో ఎదుర్కొనే ప్రధాన సమస్యలు, పరిష్కార మార్గాలను వివరించారు. విద్యార్థినులు చదువుతో పాటు ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం పరిశుభ్రతకు సంబంధించిన అంశాలపై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని అరుణ కుమారి, సృజన వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జ్యోతి, ప్రతినిధి అనుశ్రావణి తదితరులు పాల్గొన్నారు.



పోటీలో వేసిన చిత్రాలను చూపుతున్న విద్యార్థినులు

భళారే చిత్రం

- స్పెక్ట్రమ్ పేరుతో ఏయూ ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు
- విద్యార్థులు తయారు చేసిన శిల్పాలు, కళా రూపాలు, చిత్రాలతో ప్రదర్శన
- ఆసక్తి ఉన్న అంశాలనే థీమ్‌గా ఎంపిక



ప్రదర్శనలో ఆకట్టుకున్న చిత్రాలు

విశాఖపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీ లలిత కళల (ఫైన్ ఆర్ట్స్) విభాగంలో సోమవారం ఏర్పాటు చేసిన వార్షిక చిత్రకళా ప్రదర్శన ఆకట్టుకుంది. బ్యాచిలర్ అండ్ మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు 30 మంది వేసిన పెయింటింగ్స్, డ్రాయింగ్స్, శిల్పాలు, కళారూపాలను ఇందులో ప్రదర్శిస్తున్నారు. ఏటా విభిన్నమైన థీమ్స్‌తో ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తారు. ఈ ఏడాది విద్యార్థులకు ఆసక్తి ఉన్న అంశాలను ఎంపిక చేసుకుని వాటిని ప్రతిబింబించేలా చిత్రాలు, డ్రాయింగ్స్ వేయించారు. ఈ ఎగ్జిబిషన్ తిలకించేందుకు పూర్వ అధ్యాపకులు, ఏయూ విద్యార్థులు, నగరవాసులు వచ్చారు. ఆయా చిత్రాల ఫొటోలు తీసుకుని, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

టెక్స్‌టైల్‌తో ఆర్ట్ రూపొందించా



సాధారణంగా ఏదైనా ఆర్ట్ వేయాలంటే కాన్వాస్, పెయింటింగ్స్ ఉపయోగిస్తారు. వీటి అవసరం లేకుండా టెక్స్ టైల్ ఆర్ట్ విధానంలో విభిన్నమైన చిత్రాలను రూపొందించా. ఇందుకోసం డిజిటల్ ఫొటోలను వినియోగించాను. త్రీడీ డైమన్షన్‌లో ఈ చిత్రాలు విభిన్నంగా కనిపిస్తాయి. స్ట్రెస్‌లో ఉన్నప్పుడు ప్రవర్తన ఎలా ఉంటుందన్న విషయాన్ని ప్రతిబింబించేలా ఒక చిత్రం రూపొందించా. ఫై వరల్డ్ టైటిల్‌తో చిత్రాన్ని డిజైన్ చేశా. ఇందుకోసం వాటర్ కలర్స్, డిజిటల్ ప్రింట్‌ను వినియోగించి కాగితంపై చిత్రాలు చేశాను. వీటిని రూపొందించేందుకు ఎంతో ఓపిక ప్రదర్శిస్తే మంచి ఫలితాన్ని చూడగలుగుతాం. ఆర్ట్ చూసిన ప్రతి ఒక్కరూ బాగుందని చెబుతుండడంతో ఆనందంగా అనిపిస్తోంది. - ఎస్ తనూజ, బీఎఫ్ఏ విద్యార్థి

క్లాసికల్ డాన్సర్ థీమ్‌తో చిత్రం



క్లాసికల్ డాన్సర్‌ను. నాకు ఇష్టమైన క్లాసికల్ డాన్స్‌ను థీమ్‌గా తీసుకుని చిత్రాన్ని వేశాను. గొల్లభామ కీటకం తనను తాను రక్షించుకునేందుకు భిన్నంగా వ్యవహరిస్తుంది. కమలం పువ్వు నృత్య భంగిమలతో కూడిన చిత్రాన్ని రూపొందించాను. థీమ్‌తో కూడిన ఈ చిత్రంలో నన్ను నేను చూసుకున్నట్టు డిజైన్ చేశాను. ఇందుకోసం ఎంతగానో శ్రమించాను. గొల్లభామ కీటకాన్ని అవసరానికి తగ్గట్టుగా మనల్ని మనం మార్చుకుంటూ ముందుకు వెళ్లాలన్న విషయం అర్థమవుతుంది. అదే విషయాన్ని చిత్రంలో పొందుపర్చాను. - బి.లీలావతి, బీఎఫ్ఏ విద్యార్థి

జీవితంలో వివిధ దశలతో చిత్రాలు



అమ్మాయిలు ఎదిగే క్రమంలో ఎదుర్కొనే అనేక సవాళ్లకు సంబంధించిన అంశాలను ప్రతిబింబించేలా చిత్రాలు రూపొందించాను. మానవ జీవితంలో అనేక దశలను జంతువులు, పక్షులతో పోలుస్తూ చిత్రాలు వేశాను. యుక్త వయసులో శరీరంలో అనేక మార్పులు వస్తుంటాయి. ఈ క్రమంలో తనను తాను కాపాడుకునే అవసరం అమ్మాయికి పెరుగుతుంది. ఇదే మాదిరిగా ఆక్టోపస్ కూడా వ్యవహరిస్తుంది. ప్రతి ఒక్కరూ ప్రైవసీతో జీవించేందుకు ఇష్టపడుతుంటారు. అయితే దీనిని చెడగొట్టేందుకు చాలా మంది ప్రయత్నిస్తుంటారు. పిల్లి ఇదే విధంగా జీవించేందుకు ఇష్టపడుతుంది. తాను కూడా ప్రైవసీతో కూడిన జీవనాన్ని సాగించాలని భావిస్తాను. ఇదే థీమ్‌తో పక్షులు, జంతువులు కలిపి చిత్రాలు గీశాను. లైంగిక ఆకర్షణను తెలియజేసే చిత్రాలను రూపొందించాను.

- సీహెచ్ లీలా శివాణి, బీఎఫ్ఏ విద్యార్థి

2000 ఏళ్లనాటి పెయింటింగ్ సిరామిక్‌తో డిజైన్



ఔరంగాబాద్‌లోని అజంతాలో రెండు వేల ఏళ్లనాటి బోధిసత్వ పద్మపాణి పెయింటింగ్ ఉంది. కొన్నాళ్ల కిందట అక్కడకు వెళ్లినప్పుడు దాన్ని చూశాను. అద్భుతంగా అనిపించింది. గుహల్లో ఈ పెయింటింగ్స్‌ను వేశారు. అటువంటి పెయింటింగ్ వేయాలన్న ఆసక్తితో ప్రత్యేకంగా దృష్టి సారించాను. అదే పెయింటింగ్‌ను సిరామిక్‌తో రూపొందించాను. ఇందుకు చాలా కష్టపడ్డాను. సుమారు నెలన్నర సమయం తీసుకుని ఈ పెయింటింగ్ వేశాను. అరకు ప్రాంతంలో జీపుల్లో భారీ లోడ్‌తో వెళుతుంటారు. అక్కడి జీవన విధానాన్ని చూపించేలా సిరామిక్‌తో ఆకృతిని రూపొందించాను. ఇది అక్కడి జీవన విధానాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది.

- అనితారావు, ఎంఎఫ్ఏ విద్యార్థిని

అప్పన్న ఆలయ ఈఓగా వేండ్ర త్రినాథరావు బాధ్యతల స్వీకరణ

సింహాచలం, మే 26 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలిక సెలవు తరువాత సింహాచలం దేవస్థానం ఈఓగా దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ వేండ్ర త్రినాథరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. వ్యక్తిగత పని మీద అమెరికా వెళ్లిన ఆయన ఈఏడాది మార్చి 1వ తేదీ నుంచి 92 రోజుల పాటు సెలవులో ఉన్నారు. మార్చి 1న ఆయన స్థానంలో ఆర్‌జేసీ సుబ్బారావును ప్రభుత్వం ఈఓగా నియమించింది. ఏప్రిల్ 30 జరిగిన అప్పన్న చందనోత్సవం నాటి ఘటన తరువాత సుబ్బారావు సస్పెన్షన్‌కు గురవ్వడంతో ఆయన స్థానంలో విశాఖ జిల్లా దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్. సుజాత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 11న ఈఓగా బాధ్యతలు స్వీకరించారు. తాజాగా త్రినాథరావు అమెరికా నుంచి తిరిగి రావడంతో ఈఓ బాధ్యతలను ఆమె ఆయనకు అప్పగించారు. కాగా ఈఓగా బాధ్యతలు స్వీకరించిన తరువాత త్రినాథరావు జూన్ 8న జరిగే నృసింహస్వామి ఆవిర్భావ నక్షత్రం స్వాతి హవనం ఏర్పాట్లను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఏఈఓ ఎన్. ఆనందకుమార్, పిళ్లా శ్రీనివాసరావు, పర్యవేక్షణాధికారులు త్రిమూర్తులు, ప్రసాద్, ఏఈ లోకేశ్, పీఆర్ఓ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులో సంతకం చేస్తున్న ఈఓ త్రినాథరావు

వైసీపీ హయాంలో టీడీఆర్ పేరిట భారీ కుంభకోణం

- బొత్స వియ్యంకుడికి రూ.22 కోట్ల టీడీఆర్ జారీ
- జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ ఆరోపణ

విశాఖపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో విశాఖలో టీడీఆర్‌ల పేరిట కుంభకోణం జరిగిందని జనసేనకు చెందిన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. మున్సిపల్ శాఖ మంత్రిగా బొత్స సత్యనారాయణ ఉండగా తన వియ్యంకుడైన సోమి వెంకటరమణకు నిబంధనలకు విరుద్ధంగా రూ.22 కోట్ల విలువైన టీడీఆర్‌ను జారీచేశారన్నారు. విశాఖలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మూర్తియాదవ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాపులుప్పాడ, చేపలుప్పాడ సర్వేనంబర్లలో 30 ఎకరాల్లో 2011లో వుడా అనుమతితో లేఅవుట్ వేశారు. అందులో అవసరం లేకపోయినా, 40 అడుగుల రోడ్డు విస్తరించేందుకు 77 సెంట్లు భూమిని జీవీఎంసీకి 2013లో గిఫ్ట్ ఇచ్చినట్టు చూపారు. దీనిని ఆధారంగా చూపించి 2020లో 77 సెంట్ల భూమికి రెండు రెట్లు అదనంగా రూ.22 కోట్లు టీడీఆర్‌ను జారీచేశారు. రైల్వేన్యూకాలనీలోని ఇందిరానగర్ మురికివాడను తరలిస్తున్నట్టు చూపించి, అందులో వైసీపీకి చెందిన జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యురాలు ఫాతిమారాణితోపాటు ఆమె కుటుంబసభ్యులకు 600 గజాలకు డాక్యుమెంట్ ఉందని చెప్పి, ఏకంగా 1200 గజాలకు నాలుగు రెట్లు అదనంగా టీడీఆర్ జారీచేశారు. సహకరించినందుకు అప్పటి సీసీపీ విద్యుల్లతకు వెంకోజీపాలెంలోని ఒక గేటెడ్ కమ్యూనిటీలో ఫ్లాట్‌ను బహుమతిగా ఇచ్చారు. కంచరపాలెం జోగారావునగర్ మురికివాడ తరలింపునకు 5,200 గజాలకు నాలుగు రెట్లు ఎక్కువ టీడీఆర్ జారీ పెండింగ్‌లో ఉండగా కొందరు కూటమి నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు. జోన్-2 పరిధి రేవళ్లపాలెంలో రూ.208 కోట్ల విలువైన టీడీఆర్ జారీకి వైసీపీ హయాంలో ప్రతిపాదనలు జరిగితే, 30 ఏళ్ల కిందట తీసుకున్న భూమికి ఇప్పుడు టీడీఆర్ ఇవ్వడం, ఆస్తి యజమాని చనిపోతే అతని పేరిట ప్రతిపాదనలు చేయడం ఏమిటని తాను ప్రశ్నించడంతో పెండింగ్‌లో ఉండిపోయిందన్నారు. కొందరు దళారీలు కూటమి నేతల వద్దకు చేరి ప్రయత్నాలు చేస్తున్నారని మూర్తియాదవ్ ఆరోపించారు. దీనిని అడ్డుకోవాలని ఇటీవల తాను మున్సిపల్ శాఖ మంత్రి పినారాయణను కోరగా, సానుకూలంగా స్పందించారన్నారు. వెంకటపతిరాజునగర్ మురికివాడ పేరుతో రూ.45 కోట్ల విలువైన టీడీఆర్ జారీకి కొందరు కూటమి ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు ముమ్మరం చేశారన్నారు. వీటికి గతంలో పనిచేసిన విద్యుల్లత సహకరిస్తున్నారని మూర్తియాదవ్ ఆరోపించారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మూర్తియాదవ్

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

- ఏయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నరసింహారావు ఆకాంక్ష

విశాఖపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీ విద్యార్థులు ప్రతిభతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు ఆకాంక్షించారు. సోమవారం ఉదయం ఏయూ చిత్రకళా విభాగంలో ఏర్పాటు చేసిన బీఎఫ్ఏ, ఎంఎఫ్ఏ విద్యార్థుల వార్షిక చిత్రకళా ప్రదర్శనను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్సిటీ శతాబ్ది ఉత్సవాలను జరుపుకొంటున్న తరుణంలో చదవడం విద్యార్థులకు గర్వకారణమన్నారు. విద్యార్థులు సృజనాత్మకత, నైపుణ్యాలతో అద్భుతమైన కళాఖండాలను తీర్చిదిద్ది ప్రదర్శించడం గొప్ప విషయమన్నారు. లలిత కళల (ఫైన్ ఆర్ట్స్) విద్యార్థులు జాతీయ స్థాయిలో బహుమతులు సాధించి సత్తా చాటారన్నారు. ఏయూ 64 కళలకు నిలయమని, అందులో ఒకటి చిత్రలేఖనం విభాగమన్నారు. విభాగాధిపతి డి.సింహాచలం మాట్లాడుతూ జూన్ 1 వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. విద్యార్థులు తయారు చేసిన శిల్పాలు, కళారూపాలు, చిత్రాలు ప్రదర్శిస్తారన్నారు. నగరవాసులు వచ్చి ఈ ప్రదర్శనను తిలకించి విద్యార్థులను అభినందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విభాగ ప్రొఫెసర్ శిష్టా శ్రీనివాస్, విశ్రాంత ప్రొఫెసర్లు వి.రమేష్, ఎం.ఆదినారాయణ, టి. సుధాకర్ రెడ్డి, బి.మహేశ్వరదాస్, మయూఖ కుమారిదేవీ తదితరులు చిత్రకళా ప్రదర్శనను సందర్శించి విద్యార్థులను అభినందించారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నరసింహారావు

అర్జీదారులకు ఫోన్ చేసి సమస్యలపై కలెక్టర్ ఆరా

- అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి
- 237 అర్జీలు స్వీకరించిన అధికారులు

మహారాణిపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): గతవారం చెప్పిన విధంగానే కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సోమవారం అధికారుల సమక్షంలో అర్జీదారులకు ఫోన్ చేసి ప్రజా సమస్యల పరిష్కారంపై ఆరా తీశారు. భీమిలి మండలం చిప్పాడ గ్రామానికి చెందిన సరడగ అప్పయ్యమ్మ భర్త వెబ్‌ల్యాండ్‌కు సంబంధించిన సమస్యపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని అక్కడి తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. అలాగే పెందుర్తి, ఆనందపురం మండలాలకు చెందిన అర్జీదారులకు ఫోన్ చేసి సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేసి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఇతర అధికారులతో కలిసి అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 237 అర్జీలు అందాయి. ఇందులో రెవెన్యూకు 94, జీవీఎంసీకి 64, పోలీసు విభాగానికి 21, ఇతర విభాగాల నుంచి 58 ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం వివిధ శాఖలలో పెండింగ్ అర్జీలపై ఆరా తీశారు. రెవెన్యూ శాఖ ల్యాండ్ సర్వే, అటవీ శాఖ, పోలీసు, జీవీఎంసీకి సంబంధించిన అర్జీలే అధికంగా వస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు అంకితభావంతో పనిచేసి శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ఉదాసీనంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ అర్జీల పరిష్కారం వివరాలు తెలుసుకునేందుకు కాల్ సెంటరు (1100)కు ఫోన్ చేయాలని, సందేహాలు ఉన్నా అడగవచ్చని సూచించారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్, వివిధ విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

పోలీసు కమిషనరేట్‌లో 61 ఫిర్యాదులు

పోలీసు కమిషనరేట్‌కు ప్రజల నుంచి 61 ఫిర్యాదులు అందాయి. కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు వీడియో కాల్ ద్వారా సమస్యను విచారించి చట్ట పరంగా పరిష్కరించాలని ఆదేశించారు. డీసీపీలు, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కన్నకొడుకే నన్ను గెంటేశాడు

విజయనగరం జిల్లా గంట్యాడ మండలం సిరిపురంలో తనను ఆదరించాల్సిన కుమారుడు ఇంటి నుంచి గెంటేశాడు. ఆస్తి తీసుకుని వీధిలోని పెంటకుప్పలో పడేశాడు. ఈ విషయమై సీఎం, డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు చేశాను. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కార్యాలయం సూచన మేరకు తన కుమార్తె కల్యాణితో కలిసి విశాఖ కలెక్టర్‌కు ఫిర్యాదుచేశా.

- మరువాడ సింహాచలం



కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి చక్రాల కుర్చీలో వచ్చిన సింహాచలం

జూడో అసోసియేషన్ గౌరవ చైర్మన్‌గా ఎంపీ శ్రీభరత్



నియామక పత్రం అందుకుంటున్న ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ గౌరవ చైర్మన్‌గా విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ వార్షిక సమావేశం సోమవారం అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. గౌరవ చైర్మన్‌గా ఎన్నికైన శ్రీభరత్‌ను అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో జూడోను గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరించడం, యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం తన ప్రధాన లక్ష్యమన్నారు. క్రీడల ద్వారా యువత ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలని, రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి జూడో క్రీడాకారులను తయారు చేయడానికి అసోసియేషన్‌తో కలిసి కృషి చేస్తానని వారికి మాట ఇచ్చారు. జూడో అంతర్జాతీయ పోటీలు విశాఖలో నిర్వహించేందుకు కృషిచేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన జూడో కోచ్‌లు,అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రైం... crime news

ఆగివున్న వాహనాలను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



హనుమంతవాక కూడలిలో వాహనాలను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

విశాఖపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఆగివున్న వాహనాలను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో పలు వాహనాలు దెబ్బతిన్నాయి. వాహనచోదకులకు స్వల్పగాయాలయ్యాయి. హనుమంతవాక జంక్షన్‌లో సోమవారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. హనుమంతవాక జంక్షన్‌లో రెడ్‌సిగ్నల్ పడడంతో మధురవాడవైపు నుంచి నగరంలోకి వచ్చే వాహనాలు రోడ్డుపై నిలిచివున్నాయి. ఆ సమయంలో విజయనగరం నుంచి కూర్మన్నపాలెం వెళుతున్న ఆర్టీసీ మెట్రో ఎక్స్‌ప్రెస్ ఆగివున్న స్కూటీతోపాటు కారుని ఢీకొట్టింది. ఆ వేగానికి కారు ముందుకెళ్లి ఆటోని ఢీకొట్టింది. ఈ ఘటనలో మరికొన్ని వాహనాలు కూడా దెబ్బతిన్నాయి. స్కూటీపై నగరంలోకి వస్తున్న ఎం.సునీతా నీలిమావాణి(24)కి స్వల్పగాయాలయ్యాయి. ఆమెను రక్షించే క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆమె చేతికి ఉన్న బంగారం, వెండి ఉంగరాలను (రెండింటిని) దొంగిలించారు. బాధితురాలి ఫిర్యాదుపై ఆరిలోవ పోలీసులు రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ప్రమాదవశాత్తూ బావిలో పడి వ్యక్తి మృతి

కూర్మన్నపాలెం, మే 26 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన భర్త ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడంటూ దువ్వాడ పోలీసులకు గొందేశి ప్రమీల అనే మహిళ సోమవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం.. పెదగంట్యాడ మండలం పాలవలస సమీపంలోని దేవాడలో గొందేశి అప్పలరెడ్డి(36), ప్రమీల తొమ్మిదేళ్లుగా ఉంటున్నారు. అప్పలరెడ్డి హిందుజా నేషనల్ పవర్ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మద్యం సేవిస్తూ జులాయిగా తిరిగే అప్పలరెడ్డి ఈ నెల 24వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ప్రమీల బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకుండాపోయింది. అయితే సోమవారం ఉదయం తమ గ్రామానికి సమీపంలో ఉన్న బావిలో అప్పలరెడ్డి మృతదేహం ఉన్నట్టు ప్రమీల చిన్నత్త పిట్టా వరాలమ్మ సమాచారం అందించింది. దీంతో ఆమె ప్రమాదవశాత్తు తన భర్త బావిలో పడి మృతి చెంది ఉంటాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అప్పలరెడ్డి (ఫైల్ ఫొటో)

తప్పిపోయిన గంటల వ్యవధిలో తల్లి చెంతకు

మహారాణిపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి తప్పిపోయిన బాలికను గంటల వ్యవధిలోనే తల్లిదండ్రులకు టూటౌన్ పోలీసులు అప్పగించారు. సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి రామాటాకీస్ ప్రాంతంలో నివాసం ఉంటున్న రేగుల రేవతికి సాయి కీర్తన (7)అనే కూతురు ఉంది. ఇంటిలో ఎవరు లేని సమయంలో కీర్తన ఏడ్చుకుంటూ గొల్లలపాలెంకు వరకు వెళ్లిపోయింది. ఆ ప్రాంతంలో ఏడుస్తూ తిరుగుతున్న కీర్తనను సమీపంలో ఉన్న కానిస్టేబుల్ చూసి చేరదీసి వివరాలు తెలుసుకోవడానికి ప్రయత్నించాడు. కానీ పాప వివరాలు చెప్పలేకపోయింది. దీనితో టూటౌన్ పోలీసులు సోషల్ మీడియా ద్వారా పాప ఫొటోలను ప్రచారం చేశారు. ఈ ప్రకటనలను చూసిన రేవతి తన కుమార్తె టూటౌన్ పోలీసుల దగ్గర క్షేమంగా ఉందని తెలుసుకుని వెంటనే వెళ్లి పాపను అక్కున చేర్చుకుంది. తమ కుమార్తెను కాపాడి క్షేమంగా అప్పగించినందుకు సీఐ ఎర్రంనాయుడుకు, కానిస్టేబుల్ వైశివకుమార్‌కు, పోలీసు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



కీర్తనను తల్లికి అప్పగిస్తున్న టూటౌన్ పోలీసులు

మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

మానసిక ఆరోగ్య వైద్యశాలకు తరలింపు

పెందుర్తి, మే 26 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్‌లోని ఎనభై అడుగుల రోడ్డు శివారులో సోమవారం మతిస్థిమితం కోల్పోయిన అపరిచిత వ్యక్తి హల్‌చల్ చేశాడు. కాలనీలో సంచారం చేస్తూ ఇళ్లల్లోకి చొరబడి పౌరులను భయభ్రాంతులకు గురి చేశాడు. దీంతో భీతిల్లిన కాలనీకి చెందిన ఓ మహిళ 112కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందజేశారు. సీఐ కెవీ సతీశ్‌కుమార్ ఆదేశాలతో బ్లూకోట్ కానిస్టేబుళ్లు వెంకటేశ్. గోవిండ్‌లు సంఘటన స్థలానికి చేరుకుని అపరిచితుడ్ని అదుపులోకి తీసుకుని వివరాలు రాబట్టేందుకు యత్నించారు. అయితే అతను వివరాలు చెప్పలేని స్థితిలో ఉండడం, ప్రవర్తన తీరు సక్రమంగా లేదని గమనించి విషయాన్ని సీఐకి వివరించారు. సీఐ సతీశ్‌కుమార్ పర్యవేక్షణలో విశాఖలోని మానసిక ఆరోగ్య వైద్యశాలకు చికిత్స కోసం అతడ్ని పోలీసులు తరలించారు.



పోలీసుల అదుపులో మతిస్థిమితం లేని వ్యక్తి

29న విమ్స్‌లో వైద్య పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ

విశాఖపట్నం, మే 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ జారీ చేసిందని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నోటిఫికేషన్ ద్వారా ఎటువంటి రాత పరీక్ష లేకుండా కేవలం ఉత్తీర్ణత శాతం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్టు తెలిపారు. 29న ఉదయం 10 గంటలకు విమ్స్‌లో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఆస్పత్రిలో మొత్తం 28 పోస్టులను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. అర్హత కలిగిన వైద్యులు నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. స్పెషాలిటీ వైద్యులకు రూ.92 వేలు, సూపర్ స్పెషాలిటీ వైద్యులకు రూ.1.60 లక్షల వేతనం చెల్లించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వైద్యులు తమ ఉత్తీర్ణత పత్రాలతోపాటు మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు తీసుకుని హాజరుకావాలన్నారు. ఖాళీల వివరాలు: అనస్థీషియా పది, న్యూరో సర్జరీ మూడు, కార్డియాలజీ రెండు, ఎమర్జెన్సీ మెడిసిన్ రెండు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ (మెడికల్)- మూడు, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఒకటి, ప్లాస్టిక్ సర్జరీ ఒకటి, ఎండోక్రైనాలజీ ఒకటి, పల్మనాలజీ ఒకటి, మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఒకటి, జనరల్ మెడిసిన్ రెండు పోస్టులను భర్తీ చేస్తున్నట్టు రాంబాబు తెలిపారు.